


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 27 జూలై 2021 | సంపుటి : 02 | సంచిక :360 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## ప్రాజెక్టులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తికావాలి: సీఎం జగన్

పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం ఆదేశం

అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్‌పై సీఎం వైఎస్ జగన్ సమీక్ష



అమరావతి( విభారె) : వ్యవసాయ, అనుబంధ శాఖలు (హార్టికల్చర్, అగ్రి ఇన్‌ఫ్రా), పశు సంవర్ధక శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వాటి బలోపేతంపై చేపడుతున్న కీలక ప్రాజెక్టులపై సీఎం సమీక్షించారు. రెండో దశ పనులకు సిద్ధం కావాలని సీఎం ఆదేశించారు.ప్రాజెక్టులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తి కావాలని, పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. మల్టీ పర్పస్ సెంటర్లు, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫిషింగ్ హార్బర్లు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. వీటన్నింటి కోసం దాదాపుగా రూ.16,236 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.?రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకే రైతుభరోసా కేంద్రాల వద్ద మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు (ఎంపీఎఫ్‌సీలు), దీనిలో భాగంగా ఆర్బీకేల వద్ద 15 రకాల మౌలిక సదుపాయాలు?డ్రై స్టోరేజీ, డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు, గోడౌన్లు, హార్టికల్చర్ మౌలిక సదుపాయాలు, ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు, అసేయింగ్ ఎక్విప్ మెంట్లు.?మార్కెట్ యార్డుల్లో నాడు?నేడు కింద పనులతో పాటు ఇ?మార్కెటింగ్ వీటన్నింటికోసం అంచనా ఖర్చు రూ.2930 కోట్లు ఆర్బీకేల స్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు ?నియోజకవర్గాల స్థాయిలో ఫామ్ మెకనైజేషన్ (హైటెక్ హై వాల్యూ హబ్స్) ఏర్పాటుతొలిదశలో 3250 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు, ఇదివరకే ప్రారంభంరెండో దశలో కింద సెప్టెంబరు నాటికి మరో 3250 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు, వీటిలో 500 హార్వెస్టర్లు, 85 హబ్స్ ఏర్పాటుమూడో దశలో భాగంగా డిసెంబరు నాటికి 4250 కమ్యూనిటీ సెంటర్లు, 535 హార్వెస్టర్లు, 85 హబ్స్ ఏర్పాటు?మొత్తంగా 10,750 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, 1035 కంబైన్డ్ హార్వెస్టర్లు, 175 హబ్స్ ఏర్పాటువీటికోసం దాదాపు రూ.2,134 కోట్లు అంచనాకమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల వల్ల రైతులకు అందుబాటులో పరికరాలు ఉంటాయి: సీఎంకూలీల కొరత సమస్య తగ్గుతుంది: సీఎంతక్కువ ఖర్చుకే అందుబాటులోకి వ్యవసాయ ఉపకరణాలు ఉంటాయి:వ్యవసాయ పరికరాల నిర్వహణ, వినియోగంపై నైపుణ్యాలు పెంచాలని సీఎం ఆదేశం..ఐటీఐ, పాలిటెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ఈ కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశందీనివల్ల గ్రామస్థాయిలో వ్యవసాయ యంత్రపరికరాల నిర్వహణ, వినియోగంపై నైపుణ్యం ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉంటాయన్న సీఎంఏ యంత్ర పరికరం ఎంత అద్దెకు లభ్యమవుతుందన్న విషయాన్ని ఆర్బీకేల్లో ప్రదర్శించాలని సీఎం ఆదేశంఈ విషయంలో రైతులతో ఏర్పడ్డ రైతుసలహామండలి అభిప్రాయలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలనిఅధికారులకు స్పష్టం చేసిన సీఎంపాల ఉత్పత్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో సంబంధిత పరికరాలున్న కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను పెట్టాలని సీఎం ఆదేశంరాష్ట్రంలో 33 చోట్ల సీడ్ కం మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లుప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక యూనిట్ ఏర్పాటుకు నిర్ణయంకొన్ని చోట్ల అవసరాన్నిబట్టి ఒకటికి మించి యూనిట్ల ఏర్పాటుఇప్పటికే యూనిట్ల ఏర్పాటుకు దాదాపు పూర్తైన స్థలాల గుర్తింపుసీఎంకు వివరాలు అందించిన అధికారులుజగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు ఏర్పాటు, వీటికోసం అంచనా వ్యయం రూ.4,190 కోట్లుఇప్పటికే చేయూత కింద డబ్బు ఇచ్చాం: సీఎం?ఈ డబ్బు మహిళల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి

## రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్‌సీపీది అపూర్వ చరిత్ర: సజ్జల

జనరంజక పాలనకు ప్రజలు మరోసారి పట్టం

ఏలూరు కార్పొరేషన్ ఫలితాలే ఇందుకు నిదర్శనం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి: జనరంజక పాలనకు ప్రజలు మరోసారి పట్టం కట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఏలూరు కార్పొరేషన్ ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు. 12 కార్పొరేషన్లను వైఎస్సార్‌సీపీ దక్కించుకుందన్నారు. రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్‌సీపీది అపూర్వ చరిత్ర అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఏలూరులో జనమంతా ఒకేమాటగా వైఎస్సార్‌సీకి ఓటేశారు. ఏలూరులో వైఎస్సార్‌సీపీకి 56.3 శాతం మంది ఓటేశారు. టీడీపీ ఏలూరులో 28.2 శాతానికే పరిమితమైంది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఏకపక్షంగా పట్టం కట్టారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాల్లోనూ ఇవే ఫలితాలు కనిపిస్తాయని'' సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

## ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ అగ్రస్థానం: మంత్రి గౌతమ్‌రెడ్డి



నెల్లూరు:( విభారె) ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త తరహా ఆలోచనలు చేస్తున్నారని పేర్కొన్నారు.పరిశ్రమతో పాటు పరిసరాల అభివృద్ధి జరగాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో కోస్టల్ కారిడార్ ఉందని, రాబోయే రోజుల్లో పెట్టుబడులు బాగా వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో పాటు స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని జీవో తెచ్చామని తెలిపారు.

## ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి జవాబు



ఢిల్లీ: పోలవరం హెడ్ వర్క్స్ డిజైన్లలో జరిగిన మార్పుల వలన హెడ్ వర్క్స్ వ్యయం 5,535 కోట్ల నుంచి 7,192 కోట్లకు పెరిగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాత పూర్వకంగా జవాబిస్తూ పోలవరం హెడ్ వర్క్స్‌లో డిజైన్ల మార్పు కారణంగా పెరిగిన అదనపు వ్యయాన్ని కేంద్రం భరించేది, లేనిది సూటిగా చెప్పకుండా జవాబును దాట వేశారు. 2014 ఏప్రిల్ 1 నాటికి పోలవరం ప్రాజెక్ట్ ఇరిగేషన్ పనులకు అంచనా వేసిన వ్యయాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు.పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదే. నిర్మాణ ప్రణాళికతో పాటు ప్రాజెక్ట్‌లోని వివిధ విభాగాలకు సంబంధించిన డిజైన్ల రూపకల్పన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రాజెక్ట్ డిజైన్లు గోదావరి జలాల ట్రైబ్యునల్ నియమ, నిబంధనలకు అనుగుణంగా ఉన్నవో లేదో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలించి ఆమోదించిన మీదటే వాటిని ఆచరణలో పెట్టాల్సి ఉంటుందని మంత్రి షెకావత్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం ప్రాజెక్ట్‌లోని కొన్ని అంశాలకు సంబంధించిన డిజైన్లను సీడబ్ల్యూసీ మార్పులు చేసింది. మార్పుల కారణంగా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల ఎత్తు పెంచడం, పునాదుల లోతు పెంచడం, స్పిల్‌వేలోని అత్యంత లోతైన బ్లాకులలో కాంక్రీట్ గ్రేడ్‌ల పెంపు, ఎగువ కాఫర్ డామ్‌లో ఎడమ వైపు డయాఫ్రం వాల్‌తో కటాఫ్ నిర్మాణం, గేట్ గ్రూవ్స్‌లో చిప్పింగ్ పనులు, స్పిల్‌వేలో రెండో దశ కాంక్రీట్ పనుల నిర్వహణ పనులను అదనంగా చేపట్టవలసి వస్తోందని మంత్రి చెప్పారు.

## రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్

అమరావతి:( విభారె) రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం 2,128 కోవిడ్ టీకా కేంద్రాల్లో వ్యాక్సినేషన్ అందిస్తున్నారు.



ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల కోవిడ్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 45 ఏళ్లు పైబడినవారు, ఐదేళ్లలోపు చిన్నారుల తల్లులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు రెండో విడత వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోంది. అదే విధంగా కృష్ణా జిల్లా వ్యాప్తంగా సోమవారం కోవిడ్ వ్యాక్సినేషన్ మెగా డ్రైవ్ కొనసాగుతోంది. మొదటి డోస్ వ్యాక్సిన్ తీసుకోని గర్భిణులు, బాలింతలు, ఉపాధ్యాయులు, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది ఇతర హెల్త్ కేర్ వర్కర్స్‌కు వ్యాక్సిన్ అందిస్తున్నారు. మొదటి విడత డోస్ తర్వాత నిర్ణీత కాల వ్యవధి పూర్తి చేసుకున్న వారికి రెండో డోస్ కోవిడ్ టీకా వేస్తామని వైద్యులు తెలిపారు.

## 45 రోజుల్లో ఎంఎస్ఎంఈల బకాయిలు చెల్లిస్తాం : నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)కు చెల్లించాల్సిన బకాయిలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఎంఎస్ఎంఈలకు పెండింగ్‌లో ఉన్న ఎలాంటి చెల్లింపులైనా 45 రోజుల్లో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, తాను వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నానని మంత్రి చెప్పారు.ప్రశోత్నరాల సమయంలో ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ చెల్లింపుల్లో జాప్యంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ నిర్మలా సీతారామన్ ఈ వివరాలు వెల్లడించారు. కరోనా మహమ్మారితో దెబ్బతిన్న ఎంఎస్ఎంఈ పరిశ్రమ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ 5 లక్షల కోట్ల చెల్లింపులు నిలిచిపోయాయని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగాన్ని ఆదుకుంటామని కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా భరోసా ఇస్తోంది. కరోనా మహమ్మారితో కుదేలైన ఈ పరిశ్రమ కోలుకునేందుకు రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు పలు చర్యలు చేపడతామని ఆర్బీఐ పలుమార్లు స్పష్టం చేసింది.




## రూ.6,400 కోట్ల వ్యయంతో రోడ్ల అభివృద్ధి

రెండేళ్లలో పనులు పూర్తయ్యే విధంగా చర్యలు

ఏపీ రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

విజయవాడ:( విభారె) రూ.6,400 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీ రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు వెల్లడించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండేళ్లలో పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లకు నమ్మకం ఉండేలా ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తెరుస్తామని పేర్కొన్నారు. మూడు బ్యాంకులు లోన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.మరమ్మత్తులు చేసిన బిల్లులు దాదాపు చెల్లించడం జరిగిందన్నారు. గత ఏడాది రూ.600 కోట్లు బిల్లులు చెల్లించామన్నారు. వారం, పది రోజుల్లో బీఆర్ఓ తాలూక సొమ్ము విడుదలవుతుందన్నారు. నెలవారీగా బిల్లులు ఇవ్వడానికి సీఎం ఆదేశించారన్నారు. ఈ ఏడాది రోడ్ల మరమ్మత్తులకు రూ. 410 కోట్లు బడ్జెట్‌లో ఏర్పాటు చేశారని కృష్ణబాబు పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పదవికి యడియూరప్ప రాజీనామా

రాజీనామాకు గవర్నర్ ఆమోదం

రాజీనామా చేయటంలో తనపై ఎవరి ఒత్తిడి లేదు:యడ్డి



బెంగళూరు జూలై 26సీఎం పదవికి ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప రాజీనామా చేసారు. నేటి మధ్యాహ్నం రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "చేయటంలో తనపై ఎవరి ఒత్తిడి లేదని, మరొకరికి అవకాశం కల్పించేందుకు రాజీనామా చేశానని యడియూరప్ప స్పష్టం చేశారు. 75 ఏళ్ల తర్వాత కూడా నాకు అవకాశం ఇచ్చారు. 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కర్ణాటక ప్రజలకు రుణపడి ఉంటా. గవర్నర్‌కు రాజీనామా ఇచ్చి ఆమోదించాలని కోరా. ప్రధాని మోదీ, జేపీ నడ్డాకు కృతజ్ఞతలు. రాబోయే రోజుల్లో కూడా బీజేపీకి పూర్తి సహకారం అందిస్తాం. నేను ఎవరి పేరును సిఫార్సు చేయలేదు. అధిష్టానం ఎవరి పేరు సూచించినా సహకరిస్తా. కర్ణాటకలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా"నని అన్నారు.కాగా, కర్ణాటక కొత్త సీఎం ఎంపికపై బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. కర్ణాటక నూతన సీఎం ఎంపిక పరిశీలకుడిగా ధర్మేంద్ర ప్రధాన్ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి రేసులో ప్రహ్లాద్ జోషి, సీటీ రవి, ముర్గేష్ నిరాణి, బసవరాజ్ ఉన్నారు. రేపు బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో.. కర్ణాటక నూతన సీఎం పేరు ఖరారు చేసే అవకాశం ఉంది.కాగా కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్ప రాజీనామాకు రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదం తెలిపారు. అయితే, తదుపరి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసేవరకు రాష్ట్రానికి కేర్ టేకర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించాలని ఆయన సూచించారు.

కర్ణాటకకు నాలుగోసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన యెడియూరప్ప.. నాలుగోసారి

## గోదావరి లో కొనసాగుతున్న వరద పోటు

ఏలూరు ( విభారె) ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం వెస్ట్ గోదావరి వరద నీటితో పరవళ్ళు తొక్కుతుంది. స్థానిక వలంధర రేవు. లలితమ్మ ఘాట్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద వరద నీరు ప్రవహిస్తోంది. పట్టణంలోని ఇసుక ర్యాంపు వరద నీటితో మునిగాయి. ఇదే విధంగా వరద నీరు ప్రమాద స్థాయి చేరుకుంటే ఉభయ గోదావరి జిల్లాల పంటు రాకపోకలు నిలిచి పోయే పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు పోలవరం వద్ద గోదావరి వరద కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే వద్ద వరద నీటిమట్టం 32.507 మీటర్లు, పోలవరం కాపర్ డ్యాం వద్ద 33.920 మీటర్లు నమోదయింది. పోలవరంస్పిల్ వేనుండి 7,77,911 క్యూసెక్స్ వరద నీరు దిగువకు విడుదల చేసారు. వరద ముంపులో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 40 గ్రామాలు వున్నాయి. అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో 1500మంది నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్నారు.

## సంపాదకీయం

మంగళవారం 27 జూలై 2021

# విపక్షాల నిరసన.. సేఫ్ జోన్ లోకి కేంద్రం

పార్లమెంటు సమావేశాల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెసు సహా తృణమూల్ వంటి పార్టీలు గురి తప్పినట్లు కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో పెద్ద వేదికలు లోక్ సభ, రాజ్యసభలు. ఇక్కడ ప్రధాని సహా ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంటుంది. సుప్రీం కోర్టు సహా మిగిలిన ప్లాట్ ఫారాలపై లేని స్వేచ్ఛ చట్టసభల సొంతం. సర్కారును అడుగు ముందుకు వేయకుండా నిరోధించవచ్చు. అయితే ఆయా అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. పార్టీల స్వార్థం, ప్రజలకు నేరుగా సంబంధం లేని అంశాలతో సమయం వృథా చేస్తే ప్రభుత్వానిదే పైచేయి అవుతుంది. పైకి ప్రభుత్వం మాట్లాడలేకపోతున్నట్టు కనిపించినప్పటికీ అంతిమంగా రిలీఫ్ ఫీలవుతుంది. ఎందుకంటే దేశాన్ని పట్టి కుదిపేసే అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. చాలా అంశాలకు ప్రభుత్వం వద్ద సమాధానాలు లేవు. వీటిపై ప్రజలను ఆలోచింప చేసేందుకు , ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు పార్లమెంటు ను మించిన వేదిక లేదు. అయితే సమావేశాలు మొదలైనప్పట్నుంచి సీరియస్ గా సామాన్యుని అంశాలపై ప్రతిపక్షాలు దృష్టి పెట్టడం లేదు. రాజకీయ ప్రయోజనాలకు గురి పెడుతూ రచ్చ చేస్తున్నాయి. ఫలితంగా పార్లమెంటు సమావేశాల్లో ప్రజాసమస్యలు అప్రాధాన్య అంశాల జాబితాలో చేరిపోయాయి. తాజా సమావేశాల్లో ఫెగాసస్ నిఘా అనేది పెద్ద అంశంగా మారిపోయింది. దేశంలో వెయ్యి మందిపై నిఘా పెట్టినట్లు నిర్ధరణ కాని వార్తలు వెలువడ్డాయి. అందులో కేవలం 22 మందికి సంబంధించిన అంశంలో ఆధారాలు ఉన్నట్లు కొన్ని సోషల్ మీడియా వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. దీనిని ఆధారంగా చేసుకుంటూ ప్రతిపక్షాలు గొడవ మొదలు పెట్టాయి. నిజానికి ఈ వ్యవహారం ప్రజలకు పెద్దగా సంబంధం లేదు. రాజకీయ పరమైన అంశం. దీనిని పూర్తిగా పరిశీలించేందుకు స్థాయి సంఘం సరిపోతుంది. పైపెచ్చు ఈ వ్యవహారాలు చూసే స్టాండింగ్ కమిటీకి కాంగ్రెసు నేత శశిథరూర్ నాయకత్వం వహిస్తున్నారు. కేంద్ర హోం శాఖను, ఇంటిలిజెన్స్ వ్యవస్థను నిలదీసి ప్రశ్నించే అధికారం స్టాండింగ్ కమిటీకి ఉంది. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని ఒక అంశంగా పార్లమెంటులో తీసుకుంటే ఫర్వాలేదు. కానీ మొత్తం దేశం అతలాకుతలమైపోతున్నట్లు దీనిపైనే దృష్టి పెడితే మిగిలిన కీలక విషయాలు మరుగున పడతాయి. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో విపక్షాలు పునరాలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తమకు దొరికిన అవకాశాన్ని , వేదికను పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నట్లే కనిపిస్తోంది. దేశంలోని ప్రతి ఒక్కరి జీవితంతో ముడిపడిన అంశం పెట్రో ధరలు. రవాణాకు, సామాన్యుని జీవితానికి ఇంధనం తప్పనిసరి. సొంత వాహనాలు లేకపోయినా ధరల ప్రబావం పడుతుంది. కూరగాయలు మొదలు నిత్యావసరాల వరకూ పెరిగిపోయాయి. ఇందులో పెట్రోలియం రేట్ల ప్రభావం ఉంది. ఒక రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలియం ధరలను పెంచుకుంటూ పోయి దోపిడీ సాగిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర పన్నులు కలిపి చూస్తే నెలకు 50 వేల కోట్ల రూపాయల వరకూ పెట్రోలియం ఉత్పత్తుల నుంచి ప్రభుత్వాలకు లభిస్తున్నాయి. లీటర్ వంద రూపాయలు దాటిపోయింది. అలాగే కరోనా మృతుల కుటుంబాలకు పరిహారం విషయంలో కేంద్రం ఉదాసీనంగా ఉంటోంది. ఇవి ప్రజలకు నేరుగా సంబంధం ఉన్న అంశాలు. ప్రతిపక్షాలు పూనుకుని పార్లమెంటులో నిలదీస్తే ప్రజల్లోనూ ఆసక్తి వ్యక్తమవుతుంది. ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావాలనుకుంటున్న ఉద్దేశానికి ప్రజామద్దతు లభిస్తుంది. ఫెగాసస్ లాంటి విషయాలపై ఎంతటి గొడవ చేసినా ప్రజలకు పట్టదు. పైపెచ్చు ఆయా పార్టీల వ్యవహారంలోనే ఏదో తేడా ఉందని బావించే ప్రమాదమూ ఉంది. విపక్షాల దుందుడుకు అజెండాతో కేంద్రం అంతర్గతంగా సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయింది. పార్లమెంటును నడపాల్సిన బాధ్యత కేంద్రానిది. అందువల్ల ఇబ్బంది పడుతున్నట్లు నటించినా నిజానికి ప్రజా సమస్యలు తమను ఇబ్బందిపెట్టకపోవడం వారికి హ్యాపీనే. వ్యవసాయచట్టంపై బయట ఆందోళనలు సాగుతున్నాయి. విద్యుత్ సంస్కరణల చట్టం ఉరుమురిమి చూస్తోంది. రాజద్రోహం చట్టంపై సుప్రీం కోర్టు కేంద్రాన్ని ప్రశ్నిస్తోంది. ధరలు, వాక్సినేషన్ ప్రక్రియలో జాప్యం, కరోనా ప్యాకేజీ అమలులో అవకతవకలు, అంకెల గారడీ వంటివి పార్లమెంటులో పెద్దగా చర్చకు రావడం లేదు. వస్తే కేంద్ర సర్కారుకు తడబాటు తప్పదు. ఒకవేళ సామాన్య ప్రజల అంశాలు పార్లమెంటును కదిలించకపోతే ప్రతిపక్షాలదే పెద్ద తప్పు అవుతుంది. ప్రభుత్వం ఎలాగూ తప్పించుకునే ధోరణిలోనే ఉంటుంది. అందువల్ల ప్రతిపక్షాలను ఆదరించాల్సిన ఒక అజెండాను కామన్ మేన్ ముందు ఉంచాలి. అందుకు వారి సమస్యలపై చట్టసభల్లో గళమెత్తడానికి మించిన ప్రచారాస్త్రం ఉండాలి.

# మైసూరారెడ్డి రాజకీయం..



కడప, జూలై 26, (న్యూస్ పల్స్)మైసూరారెడ్డి రాజకీయ జీవితం నాలుగున్నర దశాబ్దాలు. ఆయన వైఎస్సార్ తో పాటే రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ లో సీనియర్ నేతగా ఉంటూ కీలకమైన పదవులు చేపట్టారు. ఒక దశలో హోం మంత్రి వంటి పదవిని కూడా ఉమ్మడి ఏపీలో నిర్వహించారు. అటువంటి మైసూరారెడ్డి తరువాత కాలంలో తప్పుడు నిర్ణయాల కారణంగా బద్నాం అయిపోయారు. ఆయన వైఎస్సార్ మీద వ్యక్తిగత ద్వేషంతో 2004 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిపోయారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో ఆయన కడప ఎంపీగా పోటీ చేసి వైఎస్ వివేకా చేతిలో ఓడిపోయారు. అయితే చంద్రబాబు ఆయనకు ఇచ్చిన హామీ నెరవేర్చారు. టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు అయ్యారు. ఆ తరువాత అక్కడ బాబుతో పొసగక జగన్ పెట్టిన వైసీపీలో చేరారు మైసూరారెడ్డి. 2014 ఎన్నికల తర్వాత మైసూరారెడ్డి రాజ్యసభ పదవిని చంద్రబాబు రెన్యువల్ చేయలేదు. ఆ కోపంతోనే ఆయన జగన్ చెంత చేరి 2014 ఎన్నికల్లో జగన్ కోసం పనిచేశారు. అయితే మొదట్లో బాగా ఉన్నా కూడా రాజ్యసభ సీటు ఆశించిన ఆయనకు జగన్ మొండి చేయి చూపించడంతో అందులో నుంచి తప్పుకున్నారు. ఆ తరువాత మైసూరారెడ్డి మళ్ళీ టీడీపీలోకి వెళ్తారని అంతా అనుకున్నారు. కానీ ఏ పార్టీ వైపు లేకుండా గ్రేటర్ రాయలసీమ పోరాట కమిటీ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసి సమస్యల మీద పోరాడుతున్నారు. తాజాగా మళ్లీ మైసూరారెడ్డి మీడియా ముందుకు వచ్చారు. రాయలసీమకు జగన్ అన్యాయం చేస్తున్నారు అంటూ ఆయన దుమ్మెత్తిపోశారు. జగన్ విధానాల వల్ల సీమ అన్యాయం అయిపోతోంది అని హాట్ కామెంట్స్ చేశారు. కేంద్రం గెజిట్ వల్ల సీమకు పూర్తి అన్యాయమే అంటూ మైసూరారెడ్డి అంటున్నారు. ఇక్కడ విషయం ఏంటి అంటే ఆయన చంద్రబాబుని పల్లెత్తుమాట అనలేదు. రాయలసీమ నీటి ప్రాజెక్టుల విషయంలో బాబు విధానం ఏంటి అని నిలదీయలేదు. అంటే మైసూరారెడ్డి బాబుతో కలసి మళ్లీ పయనిస్తారా ?అన్న చర్చ అయితే వస్తోంది. ఇక ఆయన కుమారులు ఇద్దరూ కూడా వైసీపీలోనే ఉన్నారు. తమ్ముడు కుమారుడు సుధీర్ రెడ్డి జమ్మలమడుగు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. సొంత కుమారుడు కూడా ఎర్రగుండ్ల నగర పంచాయతీ చైర్మన్‌గా ఉన్నారు. జగన్ కావాలనే మైసూరారెడ్డి సొంత తనయుడికి ఎర్రగుండ్ల చైర్మన్ పదవి కట్టబెట్టారు. మరి తనయులు జగన్ కి సపోర్ట్ గా ఉంటే మైసూరారెడ్డి మాత్రం ఇలా రివర్స్ కావడం విశేషం. ఆయన వింత రాజకీయం ఇదని అంటున్నారు. ఇక్కడో మాట ఉంది. మైసూరారెడ్డి అవుట్ డేటెడ్ పొలిటీషియన్ అని కూడా అని.. ఆయన కుమారులే ఆయన మాట వినే పరిస్థితి లేదంటున్నారు. దాంతో ఆయన మీడియాలో ఎంత విమర్శలు చేసినా జగన్ కి ఏమీ కాదు అని ఆ పార్టీ నేతలు సెటైర్లు వేస్తున్నారు.

# వైసీపీ గూటికి వెలగపూడి



విశాఖపట్టణం, జూలై 26, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లాలో ఆయన సీనియర్ ఎమ్మెల్యే. ఇక ఎక్కడో కృష్ణా జిల్లా నుంచి వచ్చి విశాఖలో వరసగా మూడు సార్లు గెలిచిన నేతగా ఆయనకు పార్టీలో మంచి గుర్తింపు ఉంది. అటు నారా, ఇటు నందమూరి సపోర్ట్ కూడా ఈ ఎమ్మెల్యేకు బాగా ఉంది. అయితే ఇపుడు మాత్రం ఈ ఎమ్మెల్యే మీద అధినాయకత్వం కొంత అనుమానం చూపులు చూస్తున్నట్లుగా చెబుతున్నారు. దానికి కారణం ఆయన మీద ఉన్న ఆరోపణలే. అవి చేసినది కూడా ఎవరో కాదు, బాలయ్య చిన్నల్లుడు శ్రీభరత్. ఆయన విశాఖ ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీ చేస్తే వెలగపూడి రామకృష్ణ చివరి నిముషంలో హ్యాండ్ ఇచ్చారని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఇక వెలగపూడి వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బిల్డర్ ఎంవీవీ సత్యనారాయణకు మద్దతు ఇచ్చి గెలిపించారని కూడా శ్రీ భరత్ పెద్ద డౌటే పడ్డారు. అది నిజమనేలా ఆధారాలు కూడా ఉన్నాయని అంటున్నారు ఇప్పటికీ వైసీపీ ఎంపీకి, వెలగపూడి రామకృష్ణకి మధ్య మంచి రిలేషన్స్ ఉనాయని చెబుతారు. దాంతో పాటు ఇద్దరూ కలసి వ్యాపారల లావాదేవీల్లో కూడా ఉన్నారని అంటారు. దాంతో శ్రీభరత్ అధినాయకత్వానికి చేసిన ఫిర్యాదుతో ఇపుడు ఆయన పోకడల మీద దృష్టి పెట్టారని అంటున్నారు. ఇక వెలగపూడి రామకృష్ణ మూడు సార్లు విశాఖ తూర్పు నుంచి గెలిచారు. అయితే తాజాగా జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో మొత్తం 15 వార్డులకు గానూ మూడు మాత్రమే టీడీపీ తూర్పులో టీడీపీ గెలిచింది. మెజారిటీ వైసిపీ తన్నుకుపోయింది. దాంతో వెలగపూడి రామకృష్ణ పట్టు జారుతోందని కూడా టీడీపీ పెద్దలు అంచనాకు వస్తున్నారుట. మరో వైపు మూడు సార్లు ఎమ్మెల్యేకావడంతో ఆయన మీద వ్యతిరేకత సహజంగా ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారుట. ఇక తూర్పులో బలంగా ఉన్న ఇతర సామాజిక వర్గాలకు ఈసారి టికెట్ ఇవ్వాలని కూడా టీడీపీలో చర్చ సాగుతోందిట. ఇక వెలగపూడి రామకృష్ణ కమ్మ సామాజికవర్గం. వచ్చే ఎన్నికల్లో లోకేష్ భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకుంటున్నారు. అలాగే శ్రీ భరత్ విశాఖ నార్త్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ పడతారు అంటున్నారు. ఈ నేపధ్యంలో ముగ్గురు కమ్మలకు ఒకే జిల్లాలో సీట్లు ఇవ్వడం కుదరదు. ఆ సమీకరణలతోనే వెలగపూడి రామకృష్ణని పక్కన పెట్టేస్తారు అన్న టాక్ అయితే గట్టిగానే ఉంది మరి. వెలగపూడి కూడా ఈ విషయాలు ముందే ఊహించి అప్పట్లో భరత్ విషయంలో చేయాల్సింది చేశారు అంటున్నారు. మరి వెలగపూడి రామకృష్ణకి బాలయ్య మద్దతు గతంలో ఉండేది. ఆయన రెండవ అల్లుడికే రోకరా ఇస్తే ఆయన ఊరుకుంటారా. పైగా లోకేష్ బాబు కూడా గుస్సా మీద ఉన్నారని అంటున్నారు. మొత్తానికి వెలగపూడి మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోవాల్సిందే అంటున్నారు.

# ఆ ఇద్దరు ఎవరు...?

కడప, జూలై 26, (న్యూస్ పల్స్)వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు మిస్టరీ వీడబోతోంది. అయితే ఈ హత్యకు ప్రధాన కారణమైన ఆ ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఎవరనేది ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాజకీయ నేతలా? లేక వ్యాపార భాగస్వామ్యులా? అన్నది సీబీఐ విచారణలో తేలాల్సి ఉంది. అయితే అనుమానాలు మాత్రం రాజకీయ నేతల మీదకే మళ్లుతున్నాయి. వైఎస్ వివేకానందరెడ్డిని చంపడానికి కారణాలు కూడా ఈ ఇద్దరు దొరికితేనే బయటపడతాయి. వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చి 15వ తేదీన పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. తొలుత బాత్రూంలో జారిపడ్డారని భావించినా, ఆయన శరీరంపై 11 చోట్ల కత్తిపోట్లు ఉండటంతో హత్యగా నిర్ధారణ అయింది. అప్పటికే వైఎస్ వివేకానందరెడ్డి భౌతిక కాయాన్ని బాత్ రూం నుంచి బయటకు తరలించారు. దీంతో సాక్షాధారాలు చెరిపేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీంను నియమించింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం కూడా సిట్ ను నియమించింది. అయితే రెండు సంస్థలు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏమీ తేల్చకపోవడంతో ఆయన కూతురు సునీత కోర్టును ఆశ్రయించింది. కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. దాదాపు ఏడాది కాలంగా సీబీఐ అధికారులు వైఎస్ వివేకా హత్య కేసును దర్యాప్తు చేస్తున్నారు. వందల సంఖ్యలో సాక్షులను విచారించారు. కానీ వైఎస్ వివేకాను హత్య చేసేందుకు 8 కోట్ల సుపారీ ఇచ్చారని తేలడంతో నిర్ఘాంత పోయారు. ఇంత పెద్దమొత్తంలో సుపారీ ఇచ్చారంటే రాజకీయ నేతలే అయి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నేతలకు సంబంధించి కూడా వైఎస్ వివేకా హత్య కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో టీడీపీలో ఉన్న నేతలతో పాటు అధికార పార్టీ నేతలపేర్లు కూడా ఆరోపణలుగా విన్పించాయి. సీబీఐ అధికారులు వీరిని కూడా విచారించారు. అయితే తాజాగా ఇద్దరి ప్రమేయంతో తొమ్మిది మంది ఈ హత్యకు పాల్పడినట్లు సీబీఐ విచారణలో వెల్లడయింది. ఆ ఇద్దరు ఎవరన్న చర్చ జరుగుతోంది. వైఎస్ వివేకానందరెడ్డికి బెంగుళూరులో కూడా వ్యాపారాలున్నాయి. వ్యాపార లావాదేవీల్లో తేడా వచ్చి వారెవరైనా ఈ హత్యకు కుట్రపన్నారా? అన్న కోణంలో కూడా సీబీఐ దర్యాప్తు చేస్తుంది. మొత్తం మీద ఆ ఇద్దరు ఎవరో తేలితే కాని వైఎస్ వివేకాహత్యకు కారణాలు బయట ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు.

# 75 మందికి... ఈ సారి కష్టమేనా

విజయవాడ, జూలై 26, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయని అంటారు పరిశీలకులు. గత ఎన్నికల సమయానికి అధికారంలో ఉన్న టీడీపీ.. మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. చేజేతులా అవకాశాన్ని జార విడుచుకుందని పరిశీలకులు అప్పట్లోనే చెప్పారు. దీనికి ప్రధానంగా బంధుప్రీతి (కుమారుడికి మంత్రి పదవి ఇవ్వడం), ఉదాసీనత (నేతలు చెలరేగిపోయినా.. చూస్తూ ఉండడం), అవినీతి (దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు చేపట్టకపోవడం), చంద్రబాబు అవుట్ డేటెడ్ నిర్ణయాలు వంటివి పార్టీని దెబ్బతీశాయని అప్పట్లోనే విశ్లేషణలు సాగాయి. అయితే.. ఇప్పుడు వీటిపై దృష్టి పెట్టిన చంద్రబాబు బంధు ప్రీతి మినహా.. మిగిలిన సమస్యల పరిష్కారంపైదృష్టి పెట్టారు. ప్రభుత్వ హయాంలో మంత్రులుగా ఉండి.. అవినీతికి తావులేకుండా వ్యవహరించిన వారు.. ఎమ్మెల్యేలుగా ఉంటూ.. పార్టీ కోసం కృషి చేసిన వారి జాబితాను చంద్రబాబు తెప్పించుకున్నారు. అదేసమయంలో టీడీపీ గుర్తింపు ఇచ్చినా ఇవ్వకపోయినా.. ప్రజల మధ్యే ఉన్న నాయకుల వివరాలు తెప్పించుకున్నారట. ఇదంతా పరిశీలించి.. వచ్చే ఎన్నికలపై చంద్రబాబు ఒక అవగాహనకు వచ్చారని అంటున్నారు పరిశీలకులు. ఇలా చంద్రబాబుతెప్పించుకున్న జాబితాలో.. 75 మంది పేర్లు ఉన్నట్టు చర్చ సాగుతోంది. వీరంతా చాలా నిజాయితీగా వ్యవహరించారని.. అదే సమయంలో పార్టీ కోసం పనిచేశారని ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. వీరిలో మెజారిటీ నేతలు..లోకేష్ నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరికి ఛాన్స్ ఇవ్వడం ద్వారా పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడం చాలా ఈజీయేనని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చినట్టు పార్టీలో చర్చ సాగుతోంది. వీరిలో కొందరి పేర్లు కూడా వెల్లడి అవుతుండడం గమనార్హం. అయితే.. అధికారంలోకి వచ్చేందుకు 88 మంది ఎమ్మెల్యేలు అవసరం. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం 75 మంది నిజాయితీపరులైన, పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేసే నాయకులు తేలారు. వీరితోపాటు.. కొత్తగా .. మరికొందరిని తయారు చేసుకుంటే.. ఇక, అధికారం తమవశమే అవుతుందని చంద్రబాబు భావిస్తున్నట్టు సమాచారం. ఒకవైపు ప్రజల్లో ఉంటూ.. మరో వైపు నిజాయితీ పరులైన నేతలను ప్రోత్సహించడం ద్వారా.. జగన్‌కు చెక్ పెట్టాలనేది చంద్రబాబు వ్యూహంగా ఉందని తమ్ముళ్ల మధ్య చర్చ సాగుతోంది. అదే సమయంలో పార్టీ 20 ఏళ్లుగా గెలవని నియోజకవర్గాల్లో సీనియర్లను పక్కన పెట్టేసి? తటస్థ నేతలను రంగంలోకి దించేందుకు చంద్రబాబు టీం కసరత్తులు చేస్తోంది. మరి ఇది వర్కవుట్ అవుతుందో లేదో చూడాలి.

# మరో బాలయ్యగా తమ్మినేని

శ్రీకాకుళం, జూలై 26, (న్యూస్ పల్స్)నందమూరి బాలకృష్ణ ఎప్పుడేమి మాట్లాడి సొంత పార్టీకి ఇబ్బంది తెచ్చిపెడతారో ఎవరికి తెలియదు. బాలయ్య బామ్మర్ది, వియ్యంకుడు కావడంతో చంద్రబాబు ఆయన్ను ఏమి చేయలేని పరిస్థితి. ఆయన స్థానంలో ఎవరున్నా ఈపాటికి గట్టి చర్యలే ఉండేవి. ఇప్పుడు అధికార వైసిపి లో సైతం ఇలాంటి కామెంట్స్ తో ఒక్కసారిగా చర్చల్లో నిలుస్తూ ఉంటున్నారు ఎపి స్పీకర్ తమ్మినేని సీతారాం. ఆయన చేసే వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టిస్తూ ఉంటాయి. తాజాగా స్పీకర్ చేసిన కామెంట్స్ మరోసారి హాట్ టాపిక్ అయ్యాయి. ఏపీ స్పీకర్ తమ్మినేని మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి భూమ్మీద బతికే హక్కులేదన్నారు. అంతవరకు బాగానే ఉంది. దేశంలో జరుగుతున్న అత్యాచార సంఘటనలు చూస్తే ప్రతి ఒక్కరికి మనసులో ఉండే భావనే అది. అయితే అవసరం అయితే ఇలాంటి వారిని చట్టాలకు అతీతంగా అయినా పైకి పంపించేయాలనడమే వ్యవస్థలపై ఆయనకున్న నమ్మకాన్ని తెలియచేస్తుందన్న విమర్శలు వినవస్తున్నాయి. వాస్తవానికి ప్రపంచంలో నేరస్థులకు శిక్షలు వేసే నాలుగు విధానాల్లో మనది పరివర్తన సిద్ధాంతం. తప్పు చేసిన వారిలో పశ్చాత్తాపం ఏర్పడి జీవితంలో వారు మరోసారి తప్పు చేయకుండా అనుసరించే విధానం ఐపిసి సూచిస్తుంది. తీవ్ర నేరాల్లో అవసరమైతే ఉరి శిక్షను కూడా న్యాయస్థానాలు విధిస్తున్నాయి. ఇవన్నీ తెలిసిన వ్యక్తిగా చట్టసభ కు అధిపతిగా ఉన్న తమ్మినేని సీతారాం ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో ప్రజల్లో ఎలాంటి సందేశం అందిస్తాయన్నది విద్యావంతుల ప్రశ్న. నిజానికి బూజుపట్టిన విధానాలను వదిలించుకుని దేశ న్యాయ, పోలీస్ వ్యవస్థలను బలోపేతం చేయాలిసిన బాధ్యత శాసన వ్యవస్థదే. అయితే దురదృష్టం కొద్దీ చట్టసభలు తాము చేసే చట్టాల్లో లోపాలు నేరస్థులకు అవకాశంగా మారుస్తున్నాయి. ఫలితంగా సులువుగా డబ్బున్న నేరగాళ్ళు దశాబ్దాలపాటు కింది కోర్ట్ నుంచి సుప్రీం కోర్టు వరకు కేసులు సాగదీస్తూ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం లేని పరిస్థితి కల్పిస్తున్నారు. దీనికి ముఖ్యంగా అన్ని పార్టీలు బాధ్యులే. ప్రతీ విషయంలో రాజకీయాలు ప్రభావితం చేస్తున్నాయి. నేరస్థులను కాపాడేందుకు కొందరు నేతలే ముందుంటున్నారు. ఇలాంటి స్థితి తప్పాలంటే వ్యవస్థల ప్రక్షాళన ఒక్కటే మార్గం. సగటు జీవికి చట్టం పట్ల భయం, భక్తి వచ్చేలా అన్ని వ్యవస్థలు ముందుకు వెళ్ళలిసి ఉంది. ఇందులో ముందుగా ఆదర్శంగా ఉండాలిసింది మాత్రం రాజకీయా నాయకులే. వారిపట్ల కూడా చట్టం ఒకేలా వ్యవహరిస్తుందనే నమ్మకం ప్రజల్లో కలిగిన నాడు వ్యవస్థల పట్ల గౌరవం ఇనుమడిస్తుంది. లేకపోతే తమ్మినేని సీతారాం వంటి వారు చేసే వ్యాఖ్యలు సంచలనం కోసమే తప్ప చిత్తశుద్ధి లేని వ్యాఖ్యలు గానే మిగిలిపోతాయి.

# అనంతలో తమ్ముళ్ల తన్నులాట

అనంతపురం, జూలై 26, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో కొన్ని సార్లు విభేదాలు కూడా ప్లస్ అనే చెప్పాలి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రాజకీయ పార్టీలో ఆధిపత్య పోరు అంటే పార్టీకి బలం ఉన్నట్లే అనుకోవాలి. తెలుగుదేశం పార్టీ పరిస్థితి కూడా ఏపీలో కొన్ని నియోజకవర్గాల్లో అలాగే ఉంది. తెలుగుదేశం పార్టీ నేతల మధ్య విభేదాలు బహిర్గతం అవుతున్నాయి. అధికారంలో లేకపోయినా నేతలు పోటీ పడుతుండటం పట్ల ఆనంద పడాలా? నియోజకవర్గంలో క్యాడర్ ఇబ్బంది పడుతుందని దిగులు పడాలా? అన్నది పార్టీ అధినేత చంద్రబాబుకు అర్థం కాకుండా ఉంది. తెలుగుదేశం పార్టీ ఏపీలో అధికారం కోల్పోయి రెండేళ్లు కావస్తుంది. పార్టీ అధినేతగా చంద్రబాబు క్యాడర్ లో జోష్ నింపేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో నేతల చడీ చప్పుడు లేదు. ఎన్నికల సమయంలో చూసుకుందామన్న ధీమాలో ఉన్నారు. అదే సమయంలో మరికొన్ని నియోజకవర్గాల్లో మాత్రం పోటీ విపరీతంగా ఉండటం పార్టీ అధినేతను ఆనందించే విషయమే. ఇక్కడ నాయకత్వం కోసం పోటీ పడుతుండటం విశేషంఅనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, అక్కడి ఇన్ ఛార్జి ఉమామహేశ్వర నాయుడుల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. గత కొంతకాలంగా రెండు వర్గాలు పార్టీపై పట్టు కోసం ఘర్షణ పడుతున్నాయి. ఫ్లెక్సీలు చించుకోవడం, దాడులు చేసుకోవడం కూడా ఆందోళన కల్గించే అంశమే. ఇక్కడ చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇద్దరినీ పార్టీలో కొనసాగించడంతోనే ఈ సమస్య తలెత్తిందంటున్నారు. ఇద్దరి మధ్య రాజీ ప్రయత్నం చేద్దామని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, జేసీ పవన్ రెడ్డి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చిత్తూరు జిల్లాలోనూ అదే పరిస్థితి. మదనపల్లె నియోజకవర్గం ఇన్ ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే దొమ్మాలపాటి రమేష్ ఉన్నారు. ఆయన నాయకత్వాన్ని ఒప్పుకోమని మరో వర్గం తెగేసి చెబుతోంది. ఈ అసంతృప్తి వర్గానికి టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు నాయకత్వం వహిస్తున్నారు. ఇద్దరూ గట్టి నేతలే కావడంతో అధిష్టానం ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతుంది. బాధ్యతల కోసం పోటీ పడుతున్న నియోజకవర్గాలు తక్కువగానే ఉన్నా కొన్ని చోట్ల జరుగుతున్న పరిణామాలను చూసి చంద్రబాబుకు ఏడవాలో, నవ్వాలో తెలియడం లేదంటున్నారు

# బుట్టా రేణుకకు పదవీ యోగం

కర్నూలు, జూలై 26, (న్యూస్ పల్స్)వైసీపీ నేతలను పదవులు ఊరిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలను ప్రభుత్వం తనవైపు ఆకర్షించే పనిలో భాగంగా.. ఇటీవల కాలంలో బీసీలకు ఎక్కువగా పదవులు ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ సామాజిక వర్గాలకు చెందిన వారు ఇప్పుడు పదవుల జాబితాలో ముందున్నారు. ముఖ్యంగా గత ఎన్నికల సమయంలో టికెట్లు ఆశించి, భంగపడిన బీసీ నాయకులు ఇప్పుడు నామినేటెడ్ పదవులైనా దక్కించుకోవాలని భావిస్తున్నారు. ఇలాంటివారిలో కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక పేరు మరోసారి వినిపిస్తోంది. వాస్తవానికి ఎప్పుడు నామినేటెడ్ కోటా పోస్టుల భర్తీ తెరమీదికి వచ్చినా.. బుట్టా రేణుక పేరు ఎప్పుడూ వినిపిస్తోంది. గతంలో రాజ్యసభ సీట్ల భర్తీ సమయంలోనూ ఆమె స్వయంగా వచ్చి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వెళ్లారు. అయితే అప్పట్లో ఈ క్వేషన్లు కుదరలేదు. దీంతో ఆమెకు అవకాశం లభించలేదు. ఇక, ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయనున్న నేపథ్యంలో ఆమె మరోసారి తన ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. కర్నూలుకు చెందిన సీనియర్ నాయకుడి ద్వారా బుట్టా రేణుక పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం స్థానిక సంస్థల కోటాలో మొత్తం 11 ఎమ్మెల్సీ స్తానాలను భర్తీ చేయాల్సి ఉంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలపై హైకోర్టు స్టే ఉన్న నేపథ్యంలో అది తొలిగిపోయి పరిషత్ కార్యకలాపాలు ప్రారంభం కాగానే .. ఎమ్మెల్సీల ఎన్నికకు మార్గం సుగమమం అవుతుంది. అయితే.. ఇది ఎప్పుడు తేలుతుందనేది తెలియకపోయినా.. నాయకులు మాత్రం ముందుగానే సీట్లను రిజర్వ్ చేసుకుంటున్నారు. తూర్పు గోదావరిజిల్లాకు చెందిన ఒక ఇద్దరు కూడా ఇలానే సీట్లు రిజర్వ్ చేసుకున్నారని.. అదేవిధంగా మరో సీనియర్ నేత దాడి వీరభద్రరావు కూడా రిజర్వ్ చేసుకున్నారని.. వైసీపీలో గుసగుస వినిపిస్తోంది. ఎవరి పరిస్థితి ఎలా ఉన్నా..బుట్టా రేణుక కు ఈ దఫా అయినా.. అవకాశం చిక్కుతుందో లేదో చూడాలి. 2014 ఎన్నికల్లో కర్నూలు నుంచి వైసీపీ ఎంపీగా గెలిచిన ఆమె ఆ తర్వాత టీడీపీ చెంత చేరిపోయారు.

## రఘురామ కోసమే వైసీపీ దూకుడు..?

ఏలూరు, జూ౹౹ 26, (న్యూస్ పల్స్)వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణరాజు విషయంలో వైసీపీ అధినేత జగన్ గట్టిగా ఉన్నారు. ఆయనపై అనర్హత వేటు పడాలన్నదే జగన్ ప్రధాన డిమాండ్. ఈమేరకు సాధ్యమయినంత వత్తిడిని బీజేపీపై తెచ్చేందుకు వైసీపీ ప్రయత్నిస్తుంది. రఘురామ కృష్ణరాజుపై వేటు పడితేనే తనకు పార్టీలోనూ, ప్రజల్లోనూ ఇమేజ్ పెరుగుతుంది. 22 మంది ఎంపీలను పెట్టుకుని ప్రత్యేక హోదాతో పాటు కనీసం తనపై తిరగబడిన ఎంపీని ఏం చేయలేకపోయారన్న అపఖ్యాతి జగన్ ఎదుర్కొనాల్సి ఉంటుంది.అందుకే రఘురామ కృష్ణరాజు విషయంలో అన్ని రకాలుగా వత్తిడి తెచ్చేందుకు జగన్ టీం ఢిల్లీలో ప్రయత్నిస్తుంది. పార్లమెంటు సమావేశాల్లో రెండు ఉభయ సభల్లో వివిధ అంశాలపై ఆందోళన చేస్తుంది. గత రెండేళ్లుగా వైసీపీ ఎప్పుడూ ఇంత దూకుడుగా వెళ్లింది లేదు. పేరుకు ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అని ఆందోళనలకు దిగుతున్నా అసలు డిమాండ్ రఘురామ కృష్ణరాజుపై అనర్హత వేటు వేయడమే.బీజేపీ పెద్దలకు ఇది తెలియంది కాదు. ఇప్పటికే స్పీకర్ కార్యాలయం నుంచి రఘురామ కృష్ణరాజుకు నోటీసులు అందాయి. వాటి నుంచి వివరణ అందిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశముందంటున్నారు. రఘురామ కృష్ణరాజుతో పాటు మరో ఇద్దరు టీఎంసీ ఎంపీలపై కూడా ఇదేరకమైన ఫిర్యాదులు స్పీకర్ కార్యాలయానికి అందాయి. అందుకే రఘురామ కృష్ణరాజు విషయంలో ఆలస్యం జరుగుతుందని చెబుతున్నారు.మరోవైపు అనర్హత వేటుతో పాటు ఇటు రఘురామ కృష్ణరాజును ఆర్థికంగా దిగ్బంధనం చేసే పనిలో కూడా వైసీపీ ఉంది. ఆయన కంపెనీలపై రాష్ట్రపతి నుంచి అధికార వర్గాల వరకూ ఫిర్యాదులు చేస్తుంది. ఆ కంపెనీలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తుంది. ఇలా రఘురామ కృష్ణరాజుకు ఆర్థికపరమైన చిక్కులు కల్పిస్తేనే ఆయన సెట్ అయ్యే అవకాశముందని భావించిన వైసీపీ ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. మొత్తం మీద రఘురామ కృష్ణరాజు విషయంలో జగన్ పట్టు సడలించే అవకాశం లేదని చెబుతున్నారు. మరి బీజేపీ ఎవరిని కోరుకుంటుందనేది వేచి చూడాల్సి ఉంది.

# వరుస తప్పిదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, జూలై 26, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానమైన హైకోర్టుకు , రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అనేక అంశాల్లో నిరంతరం వాద,ప్రతివాదనలు సాగుతూనే ఉన్నాయి. అనేక సందర్భాల్లో హైకోర్టు తీర్పులతో విభేదిస్తూ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెడుతోంది. ఇదివరకూ తన పంతం నెగ్గించుకునేందుకు పోరాడుతోంది. అనేక సందర్భాల్లో సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పులనే సమర్థిస్తోంది. కొన్నిసార్లు హైకోర్టులోనే తేల్చుకోమని చెబుతోంది. అధికారులు సైతం హైకోర్టు తీర్పులను అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని అనేక ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను వెంటనే అమల్లోకి తేకుండా సాధ్యమైనంతవరకూ సాగదీస్తున్నారు. అనేక మార్లు చెప్పించుకున్న తర్వాతనే వాటిపై స్పందిస్తున్నారు. బాధితులు కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలు చేసిన తర్వాత తాపీగా కోర్టుకు హాజరై క్షమాపణలు చెబుతున్నారు. ప్రభుత్వం తాను న్యాయస్థానంతో విభేదిస్తున్న అంశం ప్రజల దృష్టిలో పడేందుకు ఇలా జాగు చేస్తోందనే వాదన ఉంది. తాజాగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు మాత్రం ఒకసారి ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాల్సిన అవసరాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారులకు సంబంధించి సర్కారుకు ఉపయోగపడే సలహాలే న్యాయస్థానం అందచేసింది. ఇంతమంది సలహాదారులు అవసరమా? అని ప్రశ్నించింది. ఈ పరిశీలనకు తగినంత ప్రాతిపదిక ఉందనే చెప్పాలి.ఆంధ్రప్రదేశ్ వంటి 13 జిల్లాలతో కూడిన ఓ మోస్తరు రాష్ట్రానికి దేశంలో కేంద్రం సహా ఏ ప్రభుత్వానికి లేనంతమంది సలహాదారులున్నారు. వారికి కేబినెట్ మంత్రితో సమానమైన జీతభత్యాలు, సౌకర్యాలు అందుతున్నాయి. వారు అందచేస్తున్న సేవలేమిటనే దానిపై సమాచారం దొరకడం లేదు.. రాజకీయంగా అవసరమైన వారు, గతంలో ప్రభుత్వంలో పనిచేసి ప్రస్తుతం ఉపయోగపడతారనుకున్నవారందరికీ సలహాదారులనే ముద్ర వేసేశారు. ఏపీలో 40 మంది వరకూ సలహాదారులున్నారు. మంత్రుల సంఖ్యపై నిర్దిష్టమైన పరిమితి ఉంది. కానీ వీరి విషయంలో ఎటువంటి ఆంక్షలు లేవు. అందుకే కావాల్సిన వ్యక్తులను సలహాదారులుగా దగ్గరకు చేర్చుకోవడానికి ఈ వెసులుబాటును వినియోగించుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే అనేక రకాల విమర్శలు ఉన్నాయి. నిజంగా పనిచేసేవారికి పదవులు ఇస్తే తప్పులేదు. కానీ అడిగినవారందరికీ ఆదే హోదా కల్పించడమే అభ్యంతరకరమవుతోంది. ఒక్కో సలహాదారుపై నెలసరి 12 లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతోందని అంచనా. వారి వేతనం, వారికింద పనిచేసే సిబ్బంది జీతాలు, వాహన సదుపాయం, వసతి వంటి వాటికి భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇంతపెద్ద మొత్తంలో వెచ్చించినా , వారి నుంచి తగిన స్థాయిలో సేవలను సర్కారు పొందలేకపోతోంది.సలహాదారుల్లో చాలామందికి తగినంత పని లేదనేది ఉన్నతాధికారుల అభిప్రాయం. సలహాదారులు ఎవరి కిందా పనిచేయరు. సంబంధిత మంత్రులకు సైతం జవాబుదారీ కాదు. ఈ కారణంగానే వారి పనితీరుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సంబంధిత శాఖల కార్యదర్శులకు ఎటువంటి సమాచారం ఉండటం లేదు. నేరుగా ముఖ్యమంత్రి వీరిని డీల్ చేయాల్సి ఉంటుంది. ప్రజా వ్యవహారాల సలహాదారైన సజ్జల రామకృష్ణారెడ్డికి మాత్రమే వివిధ శాఖలపై అధ్యయనం, సలహాల వంటి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. మిగిలిన వారు నామ్ కే వాస్తేగా ఉంటున్నారు. సజ్జల సైతం పార్టీకి ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండటంతో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు రాజకీయ కోణంలో సమాధానం చెప్పడానికే సమయం వెచ్చిస్తున్నారు.వీరందరి సేవలను వినియోగించుకునేందుకు , దిశానిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రికి వెసులుబాటు ఉండటం లేదు. కనీసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అయినా ఆ బాధ్యత అప్పగించి ఉంటే బాగుండేది. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి అయిదు కోట్ల రూపాయల వరకూ వృథా వ్యయం అవసరమా? అన్నది ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలి. గతంలో సలహాదారుగా నియమితులైన సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి పనిలేదనే కారణంతో పదవి నుంచి వైదొలిగిపోయారు. సలహాదారుల పరిస్థితికి అదొక నిదర్శనం.హైకోర్టుల్లో కేసులు నడుస్తున్న సందర్భంలో న్యాయమూర్తుల ఉద్దేశం వారి వ్యాఖ్యల ద్వారా ముందుగానే కొంతవరకూ అర్థమవుతుంది. కేసు తీవ్రతను, పూర్వాపరాలను విచారణ సందర్భంగా గమనించి వారు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఒక తీర్పు వచ్చిన తర్వాత అది చట్టంతో సమానం. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆచరణలో పెట్టాల్సిందే. లేదంటే అప్పీలుకు పోవాలి.

రెండింటిలో ఏదో ఒకటి చేయకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత కార్యదర్శులు బాధ్యులవుతారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన కేసుల్లో ప్రతికూల తీర్పులు వస్తే అధికారులు అమలు చేయకుండా నాన్చుతున్నారు. రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్న కేసుల్లో ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి అనుమతులు రావడం లేదని చెబుతున్నారు. దాంతో ఉన్నతాధికారులు నిరీక్షించాల్సి వస్తోంది. ఇలా నెలల తరబడి గడచి పోవడంతో ధిక్కరణ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే ఈ మేరకు వందల కేసులు ప్రభుత్వాధికారులపై దాఖలయ్యాయి. ఇది కచ్చితంగా ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిణామమే. సివిల్ సర్వీస్ నిబంధనల ప్రకారం అధికారుల కెరియర్ పై మచ్చ పడే అవకాశం ఉంది. అధికారులు ఇబ్బందులు పడకుండా సత్వర నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ నాయకులకు కేసులు కొత్త కాదు. కానీ ప్రభుత్వాధికారులు ఉన్నత స్థానానికి చేరుకోవడానికి న్యాయస్థానాలలో ధిక్కరణ కేసులు ఆటంకంగా పరిణమిస్తాయి.

## ముద్రగడకు దారేది

కాకినాడ, జూలై 26, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి కాపు రిజర్వేషన్ పోరాట యోధుడు ముద్రగడ పద్మనాభం రాజకీయంగా ముందడుగు వేయాలా లేదా అన్న అంశం తేల్చుకోలేకపోతున్నట్లు సన్నిహిత వర్గాల సమాచారం. కోస్తా జిల్లాల్లో కాపు సామాజిక వర్గంలో ముద్రగడ పద్మనాభం ఒక క్రేజీ స్టార్. ఆయన మాటకు కాపు వర్గంలో మంచి విలువే ఉంది. గత ఎన్నికలకు ముందు ముద్రగడ కుటుంబానికి చంద్రబాబు చేసిన ఘోర అవమానాలతో కాపు లు టిడిపి పై అలకబూనారు.



దీనికి తోడు జనసేన టిడిపి నుంచి దూరం జరగడంతో మెజారిటీ పవన్ వెంట మరికొందరు జగన్ వెంట నడిచారు. నాటి ఎన్నికల్లో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మౌనం వహించారు.ముద్రగడ పద్మనాభం ముందు రెండు అవకాశాలు ఉన్నాయి. ఒకటి వైసిపి నుంచి వస్తున్న ఆఫర్లు అందుకోవడం. రెండు బిజెపి నుంచి ఇచ్చిన ఆఫర్ తీసుకోవడం. ఈ రెండింటి లో ఏది బెస్ట్ అన్నది అంతర్గతంగా ఆయన సన్నిహితులతో చర్చిస్తున్నారని అంటున్నారు. . మరోపక్క ఈ రెండు పార్టీల్లో ఎందులో చేరి పదవి చేపట్టినా కాపు రిజర్వేషన్ అంశం తాకట్టు పెట్టి లబ్ది పొందారనే విమర్శలను మూట గట్టుకుంటానేమో అన్న ఆందోళన ఆయన్ను వెంటాడుతుంది. టిడిపి పై మాత్రం కాపు ఉద్యమ సమయంలో రేగిన పగ ప్రతీకారాలు ఆయన లో ఇంకా చల్లారలేదు.ఇప్పటికే కాపు రిజర్వేషన్ల సాధన ఉద్యమం నుంచి తాను వ్యక్తిగత కారణాల రీత్యా తప్పుకుంటున్నా అంటూ ముద్రగడ పద్మనాభం చాలాకాలం క్రితమే ప్రకటించేశారు. అప్పటినుంచి క్రియాశీలకంగా ఏ కార్యక్రమాల్లో ఆయన పాలు పంచుకోవడం లేదు. దాంతో వివిధ పార్టీల అగ్రనేతలు ఆయన ఇంటికి వచ్చి వెళుతూ రహస్య చర్చలు జరుపుతూనే ఉన్నారు. అవన్నీ విని ఆలోచించి చెబుతా అంటూ అన్ని అవకాశాలు తనవద్దే అట్టేపెట్టుకుని సమయం కోసం వేచిచూస్తున్నారు ముద్రగడ పద్మనాభం. మరోపక్క రాజకీయాలకు ఇక పూర్తిగా స్వస్తి చెప్పేయడం కూడా మంచిదనే యోచన కూడా పద్మనాభం చేస్తున్నారని అంటున్నారు. కొత్త తరం రాజకీయాలతో తన తరం ఇమడలేదని కూడా ఆయన ఆలోచన గా ఉందని తెలుస్తుంది. చూడాలి కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టాకా ముద్రగడ పద్మనాభం ఏదో ఒక నిర్ణయం కోసం అడుగు ముందుకు వేయక తప్పదు. అది ఏమై ఉంటుందా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్.

## క్రైసిస్ మేనేజ్ మెంట్ లో టీడీపీ

విజయవాడ, జూలై 26, (న్యూస్ పల్స్)ఏదైనా క్రైసిస్ లో ఉన్నప్పుడే నాయకత్వ లక్షణాలు బయటపడతాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే లీడర్ గా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. నారా లోకేష్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నాలుగేళ్లలోనే ఆయకు ఈ అవకాశం లభించింది. అయితే ఆయన తొలి నాళ్లలో కొంత తడబడినా ఇప్పుడిప్పుడే అన్ని రకాలుగా పుంజుకుంటున్నారన్నది పార్టీ నేతల అభిప్రాయం. నారా లోకేష్ ఈ మూడేళ్లలో మరింత పరిణితి సాధించగలిగితే ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థి అయినా ఎవరికి అభ్యంతరం ఉండదు.నారా లోకేష్ తొలి నుంచి తన టీమ్ కే పరిమితమయ్యే వారు. తనకంటూ ఒక టీమ్ ను ఏర్పాటు చేసుకుని వారిచ్చే సలహాలు, సూచనలతోనే వెళ్లారు. సీనియర్లను పట్టించుకోలేదు. అది రాజకీయంగా కొంత ఇబ్బంది అయింది. అయితే ఇప్పుడిప్పుడే నారా లోకేష్ తనకు చిక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో పడ్డారు. తండ్రి చంద్రబాబు ఎటూ ఇమేజ్ ఉన్న లీడర్ కావడంతో ఆయన పని ఆయన చేసుకుపోతున్నారు.నారా లోకేష్ మాత్రం యువతను టార్గెట్ చేశారు. ఇటీవల టెన్త్, ఇంటర్ పరీక్షలను రద్దు చేయాలని అధికార పార్టీపై పెద్ద యుద్ధమే చేశారు. చివరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో దిగిరావడం నారా లోకేష్ కు అనుకూలంగా మారింది. వీరంతా భవిష్యత్ ఓటర్లని, వారిని టీడీపీ వైపు మళ్లించడంలో నారా లోకేష్ సక్సెస్ అయ్యారని టీడీపీ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరిగింది. పరీక్షల రద్దు నారా లోకేష్ విజయమంటూ మార్మోగడంతో ఆయనకు రాజకీయ కిక్కు అంటే ఏందో అర్థమయిం దంటున్నారు.ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగులు ఏపీలో ఆందోళన చేస్తున్నారు. దీంతో నారా లోకేష్ నిరుద్యోగులకు అండగా నిలవాలనుకుంటున్నారు. కరోనా కొంత తగ్గుముఖం పట్టిన వెంటనే నిరుద్యోగులతో సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారు. వర్చువల్ గా కాకుండా తిరుపతి, విశాఖపట్నం, అనంతపురం, విజయవాడ వంటి ప్రాంతాల్లో నిరుద్యోగ యువతతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్న యోచనలో నారా లోకేష్ ఉన్నారు. మొత్తం మీద నారాలోకేష్ యువతనే టార్గెట్ గా చేసుకుని మందుకు వెళుతున్నారు.

# టీటీడీపీకి మహా చెడ్డ రోజులు

హైదరాబాద్, జూలై 26, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి చెడ్డ రోజులు ముందున్నాయా. రాజకీయంగా అసలు కాని కాలమే నడుస్తోందా అంటే అవును అనే సమాధానం వస్తోంది. తెలంగాణాలో టీడీపీ పాలిటిక్స్ ఖతం అయింది. ఇది వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు కానీ వందల కోట్ల విలువ చేసే భవనం మాత్రం ఆ పార్టీకి రాజధాని నడిబొడ్డున ఉంది. ఇంతటి ఆస్తిని కాపాడుకోవడం కోసమే తెలంగాణాలో మాకూ ఒక పార్టీ శాఖ ఉందని టీడీపీ పెద్దలు హడావుడి చేస్తూ ఉంటారు. అయితే ఇపుడు ఆ భవనానికి కూడా రోజులు దగ్గరపడ్డాయని అంటున్నారు.ఆనాడు చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎం గా ఉండగా బంజారా హిల్స్ రోడ్ నంబర్ 2 లో సువిశాలమైన భూమిని తానే పెద్దగా ఉన్న ప్రభుత్వం నుంచి పొందారు. ఎన్టీయార్ మెమోరియల్ ట్రస్ట్ పేరిట దాన్ని తీసుకున్నారు. ముప్పయ్యేళ్ళకు లీజు లెక్కన ఆ భూమిని చంద్రబాబు సీఎంగా పార్టీ ప్రెసిడెంట్ చంద్రబాబుకు కేటాయించారు. నెలకు తొంబై వేల అద్దెతో ఈ భూమి దఖలు పడింది. ఆ తరువాత మరో ఏడేళ్ల పాటు టీడీపీ ప్రభ వెలిగింది. ఇక తెలంగాణా ఉద్యమం పుట్టింది. వైఎస్సార్ రెండు సార్లు సీఎం గా పనిచేశారు. విభజన తరువాత రెండు సార్లు టీయారెస్ అధికారంలోకి వచ్చింది. మొత్తానికి 1999 ఎన్నికలే టీడీపీకి తెలంగాణాలో చివరికి అయ్యాయి.హైదరాబాద్ లో ఎన్టీయార్ భవన్ ఒకనాడు సందడిగా ఉండేది. ఇపుడు చంద్రబాబు హైదరాబాద్ లో ఉంటున్నా అక్కడికి వెళ్ళరు. విభజన ఏపీకి తొలి సీఎంగా ఆయన గుంటూరు దగ్గర ప్రభుత్వం నుంచి పార్టీ అధినేతగా భూమి తీసుకుని భవ్యమైన బిల్డింగ్ అక్కడా కట్టేశారు. ఇలా ఎన్టీయార్ ట్రస్ట్ పేరిటనే ఈ ఆస్తులు ఉన్నాయి. కానీ తెలంగాణాలో పని లేదు. పార్టీ వ్యాపకాలు అంతకంటే లేవు. మరి ఎన్టీయార్ భవన్ ని ఏం చేస్తున్నారు అంటే పూర్తి వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారుట. ఈ ఆరోపణలు చేసింది ఆ భవన్ లో దశాబ్దాలుగా పనిచేస్తున్న తెలంగాణాకు చెందిన ఉద్యోగులు. ఈ భవనాన్ని తెలంగాణా సర్కార్ లీజు రద్దు చేసి వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నేరుగా కేసీయార్ కే వారు లేఖ కూడా రాశారు.అసలే తన శిష్యుడు రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా చేసి తన మీదకు ఉసి గొల్పాడని కేసీయార్ చంద్రబాబు మీద గుర్రు మీద ఉన్నారు. తెలంగాణా అస్తులు ఎవరి దగ్గర ఉన్నా లాగేస్తామంటూ గర్జించే కేసీయార్ కి ఇది అంది వచ్చిన అవకాశమే. వందల కోట్ల విలువ చేసే ఈ సంపదను తెలంగాణా ప్రభుత్వ ఆస్తి అని లాగేసుకుంటే చేసేది ఏమీ ఉండదు. లీజు నిబంధనల ప్రకారం సేవా కార్యక్రమాలకే ఉపయోగించాలి. కానీ ఇప్పటిదాకా అక్కడ రాజకీయాలు చేస్తూ వచ్చారు. ఇన్నాళ్ళూ పార్టీ ఉంది కాబట్టి దాన్ని టీఆర్ఎస్ పట్టించుకోలేదు. ఇపుడు టీడీపీ అన్నదే లేదు అంటున్నారు. దాంతో పాటు ప్రెసిడెంటే గోడ దూకేలా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీయార్ భవన్ని కేసీయార్ స్వాధీనం చేసుకుంటారా. లీజు గడువు చూస్తే 2027 దాకా మాత్రమే ఉంది. నిబంధనలు పాటించడం లేదు అని చెప్పి కథ క్లోజ్ చేస్తే టీడీపీ ఖేల్ ఖతమే అంటున్నారు.

## కొంత్రాయిగుడ లో మంచినీటి సమస్య తీర్చాలని గిరిజన సంఘం డిమాండ్

విశాఖపట్నం , జూలై 26, (న్యూస్ పల్స్)బస్కీ పంచాయతీ కొంతర్రాయిగూడ గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సంఘం పంచాయితీ నాయకులైన సమర్ది బాబురావు మాట్లాడుతూ గత 3 నెలల క్రితం వేసిన బోరు పూర్తి చేసి కొంత్రాయిగుడ లో మంచినీటి సరఫరా చేయడంలో పంచాయతీ అధికారులు ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా మా ఊరులో మంచినీరు సమస్య తీవ్రంగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు అనేక సందర్భాలలో సంబంధిత అధికారులకు సర్పంచి గారికి వినవించినప్పటికీ ఎటువంటి పరిష్కారం దొరకలేదు నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా వెంటాడుతున్న అధికారులు స్పందించకపోవడం దారుణం, కలుషిత నీరు త్రాగుతూ నిత్యం అనారోగ్యం పాలవుతున్నారు ఇప్పటికైనా కొంత్రాయిగుడ గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల పంచాయతీ కార్యాలయం ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.కన్నయ్య కె.సుబ్బారావు కె.సోములు జి.రామన్న కె.జయంతి కె.లక్ష్మి ఎస్.కలిమా ఎస్.కుమారి ఎస్.సంధ్య రమేష్ కిండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అనుగొండలో అతిసారం

కర్నూలు , జూలై 26, (న్యూస్ పల్స్)కోడుమూరు మండలం అనుగొండలో అతిసార ప్రబలింది. 12 మందికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అతిసార బారిన పడి ముగ్గురు మృతి చెందారు. ఇందులో నాలుగేళ్ల చిన్నారి ఐశ్వర్య ,గిడ్డయ్య పుల్లమ్మ అను వృద్ధులున్నారు. అస్వస్థతకు గురైన వారిని కోడుమూరు , కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా వుంది. తాగునీరు కలుషితమే కారణమని గ్రామస్తులు ఆరోపించారు.

## గిరిజన ఆణిముత్యంకు ఘన సన్మానం

### ఎమ్మెల్యే పాల్గుణ

విశాఖపట్నం జూలై 26, (న్యూస్ పల్స్)హుకుంపేట మండలంలోని గూడ పంచాయతీ, కోడేలి గ్రామానికి చెందిన కిముడు ఆది నారాయణ, నాగరత్నం దంపతుల కుమార్తె కిముడు మోద లావణ్య ఏపీపిఎస్ సిలో గ్రూప్-2 కేటగిరీ, పశు సంరక్షణ శాఖలో సీనియర్ ఎకౌంట్ గా ఉద్యోగం పొందిన శుభ సందర్బంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వారి గృహానికి వెళ్ళి గిరిజన అనిముత్వం లావణ్య ను సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూగిరిజన ప్రాంతంలోని అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టి, తన విద్యాభ్యాసంలో మేటిగా రాణించి ఇలాంటి ఉన్నతమైన ఉద్యోగం పొందడం చాల సంతోష దాయకమని ఆయన అన్నారుప్రతి గిరిజన యువత విజయమే లక్ష్యంగా చదువుల్లో రాణించిన లావణ్య వంటి కృషీ పట్టుదల ఆదర్శంగా తీసుకొని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో హుకుంపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్: రామకృష్ణ స్థానిక సర్పంచ్ సమిడ పూర్ణిమ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ మాజీ వైస్ ఎంపిపి ×బత్తిరి రవిప్రసాద్ సీనీయర్ నాయకులు జన్ని సింహచలం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు సాయి కోటి అనిల్ శివ జగదీష్ తదితరులు పాల్గున్నారు

## అమర వీరులకు నివాళులు

విశాఖపట్నం , జూలై 26, (న్యూస్ పల్స్) కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్ రోడ్ లో విక్టరీ ఎట్ సీ స్థూపం వద్ద వీరమరణం చెందిన సైనికులకు వైస్ అడ్మిరల్ శ్రీకుమార్ నాయర్ నివాళులు అర్పించారు. జూలై 26న భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి, భారతదేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా భారత్ విజయం సాధించింది. విక్టరీ ఎట్ సీ స్థూపం వద్ద నావికాదళ అధికారులు, నగర పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సీన్హా నివాళులు అర్పించారు.

# ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

### ఏబీవీపీ జాతీయ కార్యవర్గం డిమాండ్

నెల్లూరు జూలై 26, (న్యూస్ పల్స్) రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అరకొర ఉద్యోగుల జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్ పేర్కొన్నారు.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి నాయుడుపేట, సూళ్లూరు పేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక నాయుడుపేట ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నూతన జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు . నిరుద్యోగ యువత భవిష్యత్తు లతో చెలగాటం ఆడవద్దని, నిర్దిష్టమైన ప్రణాళికలతో ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుకోవాలని కోరారు. లక్షలు ఇస్తామని ఉద్యోగాలు వేల సంఖ్యలో కూడా ఇవ్వక పోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సులూరుపేట నాయుడుపేట ఏబీవీపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా వ్యాక్సినేషన్

### కోటికేశవరం పీ.హెచ్.సీ లో వేగవంతం

కాకినాడజూలై 26, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కోటికేశవరం పి. హెచ్.సి రాఘవాపురం, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, కోటి, శ్రీరంగపట్నం గ్రామాల ప్రాథమిక ఉపకేంద్రాలలో కరోనా నియంత్రణకు వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని డాక్టర్ పి.పుణ్యశాంతి తెలియజేశారు. మెదటి డోస్ వేసుకుని రెండవ డోస్ కు ఇచ్చిన గడువు సమీపించిన వారికి కూడా రెండవ డోస్ వేస్తున్నామని అన్నారు. . ఆయా గ్రామాల్లో వాలంటీర్లు,ఆశాలు,ఏం.ఎన్.ఏం ల ద్వారా ఇంకా ఎంతమంది మిగిలి ఉన్నారు ఎవరెవరు వ్యాక్సినేషన్ వేయించుకోవాలి అనే దానిపై పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నామన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి సమీప సబ్ సెంటర్లోనే కరోనా వ్యాక్సిన్ ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. 45 ఏళ్లు పైబడిన వారందరికీ టీకాలు వేస్తున్నామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రెండు టీకాలు వేయించుకోవాలని మొదటి టీకా వేయించుకుని రెండవది పూర్తి కాకపోతే ఫలితం ఉండదన్నారు. వైరస్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే టీకా ఒక్కటే మార్గం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ. హెచ్.ఈ.వో సూపర్వైజర్ ప్రసాద్,పి. హెచ్.ఎన్ శకుంతలా కుమారి,పలువురు ఏఎన్ఎంలు,ఆశాలు,హెల్త్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నెల్లూరు క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు జూలై 26, (న్యూస్ పల్స్)నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని దర్గామిట్ట ప్రాంతంలో ఉన్న నెల్లూరు క్లబ్ లో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ను నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు క్లబ్ లోని సభ్యులందరు కలసిమెలసి ఐక్యమత్యంగా ఉండి, నెల్లూరు క్లబ్ ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలి అని సూచించారు. నెల్లూరు క్లబ్ నందు సభ్యుల సౌకర్యార్థం నూతన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు క్లబ్ నిర్వహణ కమిటీ సభ్యుల సేవలను కొనియాడారు.పై కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ యేసు నాయుడు, మాజీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి మరియు నెల్లూరు క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ మమత ను మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఐ నాయకులు

మద్దికేర జూలై 26, (న్యూస్ పల్స్)మద్దికెర మండల నూతన ఎస్.ఐ గా బాధ్యతలు చేపట్టిన మమత ను సిపిఐ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఆదివారం రోజున స్థానిక మద్దికేర పోలీస్ స్టేషన్ నందు సిపిఐ నాయకులు కలిసి మహిళ ఎస్సై మమత కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సాధించాలని ఎస్సై కు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మమత మాట్లాడుతూ సారా,మట్కా,పేకాట మరియు బెట్టింగ్ లను నిర్వహించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.మహిళలందరూ తమ సెల్ ఫోన్ నందు దిశ యాప్ ను ఇన్స్టాల్ కోవాలని తెలియజేశారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నెట్టికంటయ్య,మాజీ మండల కార్యదర్శి వలి సాహెబ్,మండల రైతు సంఘం నాయకులు బసన్న,సీపీఐ నాయకులు మనోహర్,సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై కూర్చొని గుంజీలు తీస్తూ రైతుల అర్థనగ్న నిరసన దీక్ష

తుంగతుర్తి జూలై 26, (న్యూస్ పల్స్)సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం, సంగెమ్ ప్రభుత్వ ఐ కే పి సెంటర్లలో తరుగు తీసిన ధాన్యం డబ్బులు ఇప్పించాలని కోరుతూ అన్నారంలో రైతులు తన్నీరు వెంకన్న, పూస పెల్లి శ్రీను, గోపగాని వెంకట రామనర్సయ్య, తన్నీరు సోమనరసయ్య లు మోకాళ్లపై కూర్చొని గుంజీలు తీస్తూ అర్థ నగ్న నిరసన దీక్షలు చేశారు. అన్నారం, సంగెమ్ ఐ కే పి సెంటర్ల నిర్వాహకులు క్వింటాల్ కు 10 కిలోలు తరుగు పేరున ధాన్యాన్ని తగ్గించి రైతుల నోట్లో మట్టి కొట్టారని రైతుల ఉసురు నిర్వాహకులకు తగులుతుందని రైతులు తెలిపారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ కు ఐ కే పి సెంటర్ల దోపిడీని అరికట్టాలని, మాకు తరుగు తీసిన ధాన్యానికి డబ్బులు ఇప్పించాలని కోరుతూ పిర్యాదు ఇచ్చి నెలలు నెలలు దాటినా పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు.

# 19 వ వార్డు సచివాలయం ప్రారంభించిన యమ్ యల్ ఏ శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి

నంద్యాల జూలై 26, ((( విభారె) నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డు పొన్నా పురం కాలనీలో 40 లక్షల రూపాయల సెంట్రల్ నిధులతో వార్డు సచివాలయం ను నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి సోమవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాలవద్దకే పాలన అందించడం చాలా సంతోషదగ్గ విషయం మని ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు సచివాలయంలో నే సమస్యలు పరిష్కరిస్తారు అని అన్నారు. కరోనా సమయంలో కూడా వాలెంటర్లు సచివాలయ ఉద్యోగస్తులు పనితీరు ఎంతో గర్వించదగ్గ విషయమని తెలియజేశారు. ఇప్పటికే నంద్యాల పట్టణంలో 10 గ్రామ సచివాలయలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని గ్రామ సచివాలయాలు తయారవుతున్నాయని వాటిని కూడా త్వరలోనే ప్రారంభించి ప్రజలకు వారి సమస్యలను సచివాలయంలోని పరిష్కరించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి కానీ మా దృష్టికి కానీ తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కుఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, మార్కెట్ యార్డ్ చైర్మన్ఈషాక్ బాషా,19వార్డు కౌన్సలర్స్ పరుచూరి లక్ష్మీనారాయణమ్మ, కృష్ణమోహన్, వైసిపి నాయకులు దేశం సుధాకర్ రెడ్డి , శ్రీరాములు, జంబులయ్యా, మధు గౌడ్, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విగాదం కలిగించరాదు...

## ఎస్.ఐ షామీర్ భాష

తుగ్గలి జూలై 26, ((( విభారె)తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో గల రౌడీ షీటర్లకు తుగ్గలి ఎస్.ఐ షామీర్ కౌన్సిలింగ్ ఇచ్చారు.ఆదివారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎస్.ఐ షామీర్ బాషా రౌడి షీటర్స్ తో మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అల్లర్లు మరియు గొడవలు సృష్టించకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్.ఐ తెలియజేసారు.గ్రామాలలో ఎవరైనా శాంతి భద్రతలకు విగాదం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని,వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ షామీర్ బాషా హెచ్చరించారు.గ్రామాలలో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీధి లైట్లు, సి,సి కెమెరాలు స్పీడ్ బ్రేకర్స్ వేయాలి

## సీపీఐ

ఎమ్మిగనూరు జూలై 26, ((( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో గోనెగండ్ల బైపాస్ రోడ్డు నాగిరెడ్డి పెట్రోల్ బంక్ నుండి కలుగొట్ల రోడ్డు వరకు వీధిలైట్లు సీసీ కెమెరాలు స్పీడ్ బ్రేకర్లు వేయాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో కలగొట్ల రోడ్డు దగ్గర రాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి తిమ్మగురుడు పట్టణ సహాయ కార్యదర్శి సమివుల్లా వారు మాట్లాడుతూ పట్టణం దినదిన అభివృద్ధి చెందుతున్న తరుణంలో రోడ్డు పక్కనే ఉన్న కరెంటు పోల్స్ కు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నరని ప్రమాదాలు నివారించేందుకు స్పీడ్ బ్రేకర్ వేయాలని నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా మునిసిపల్ అధికారులు తక్షణమే పనులు చేపట్టాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు జబ్బార్ ,బాలరాజు , విజేంద్ర, కాజా, మల్లికార్జున గౌడ్ ,ఏసేపు ,మార్క్, నీలకంఠ ,గంగన్న, మౌలాలి ,రసూల్ ,పాల్గొన్నారు,

## జగన్ ప్రభుత్వానిది హిందూ వ్యతిరేక వైఖరి

శ్రీశైలం జూలై 26, ((( విభారె) శ్రీశైలంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు దర్శించుకున్నారు. ఘంటా మఠం, లాలితాంభిక దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. తరువాత అయన మీడియాతో మాట్లాడారు. శ్రీశైలంలో అన్యమత రాజకీయ నాయకులు బినామీ పేర్లతో వ్యాపారం చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. శ్రీశైలంలో అన్యమతస్థుల ఇళ్లను దేవాలయ ప్రదేశం నుంచి తొలగించాలి. అన్యమతస్థులకు శ్రీశైలం వెలుపల ఇళ్ళు నిర్మించాలని అయన అన్నారు. లాలితాంభిక దుకాణాలను అద్దెకు ఇవ్వడం లేదు, వేలం నిర్వహించడం లేదు. జగన్ ప్రభుత్వానిది హిందూ వ్యతిరేక వైఖరి. ఓటు బ్యాంక్ కోసం క్రిస్టియన్, ముస్లింల కు తాయిలాలు, టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. ఏపీలో హిందువులకు భద్రత ఉందా.

# మీ థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యంగా ఉండటానికి మీరు తినవలసిన సాధారణ ఆహారాలు ఏమిటో మీకు తెలుసా?



థైరాయిడ్ గ్రంథి మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో ఒకటి. దీని ఆరోగ్యకరమైన పనితీరు మన మొత్తం ఆరోగ్యానికి అవసరం. థైరాయిడ్ గ్రంథి యొక్క ఆరోగ్యకరమైన పనితీరులో మన ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న ఈ అవయవం మన మెడ ముందు కూర్చుని శరీర ఉష్ణోగ్రత, శ్వాసక్రియ, హృదయ స్పందన రేటు, శరీర బరువు మరియు మహిళల్లో రుతు చక్రం వంటి ముఖ్యమైన శారీరక విధులను నియంత్రిస్తుంది.థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయడానికి ఆరోగ్యకరమైన ఆహారం అవసరం. జీవక్రియ వ్యవస్థను బలోపేతం చేయడానికి మన ఆహారం ఆరోగ్యంగా ఉండాలి, ఇది సరైన థైరాయిడ్ పనితీరును నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యాన్ని ఏ ఆహారాలు పెంచుతాయో ఈ పోస్ట్‌లో చూడవచ్చు.పెరుగు విటమిన్ డి మరియు ప్రోబయోటిక్స్ తో సమృద్ధిగా ఉన్న పెరుగు థైరాయిడ్ గ్రంథి యొక్క మంచి ఆరోగ్యాన్ని నిర్ధారిస్తుంది. ఇది థైరాయిడ్ అసమతుల్యతతో తరచుగా బాధపడే మన గట్లోని మంచి బ్యాక్టీరియాను సమతుల్యం చేస్తుంది.మధుమేహం ఉన్నవారు చేపలు తినొచ్చా... తింటే ఏదైనా హాని కలుగుతుందా?మధుమేహం ఉన్నవారు చేపలు తినొచ్చా... తింటే ఏదైనా హాని కలుగుతుందా?సాల్మన్ సాల్మన్ మన జీవక్రియను పెంచే ఉత్తమ మత్స్య. సాల్మన్ ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలను కలిగి ఉంటుంది, ఇది శోథ నిరోధక లక్షణాలను పెంచుతుంది. ది జర్నల్ ఆఫ్ న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీలో నిర్వహించిన ఒక అధ్యయనంలో, సాల్మన్ వినియోగం మంటను తగ్గించడంలో అత్యంత ప్రభావవంతంగా ఉన్నట్లు కనుగొనబడింది.డైట్ లో ఉన్నప్పుడు 10 ప్రమాదకరమైన విషయాలు మీకు తెలుసా?డైట్ లో ఉన్నప్పుడు 10 ప్రమాదకరమైన విషయాలు మీకు తెలుసా?ఆలివ్ నూనె ఆరోగ్యకరమైన నూనెలు వంటి ఆహార కొవ్వులు మన శరీరం యొక్క సరైన పనితీరుకు మరియు బరువు తగ్గడానికి ముఖ్యమైనవి. సరైన రకమైన కొవ్వులు మరియు నూనెలను తీసుకోవడం జీవక్రియను పెంచుతుంది, ఆకలిని తగ్గిస్తుంది మరియు అదనపు కేలరీలను కాల్చేస్తుంది. ఆలివ్ నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు నిండి ఉన్నాయి, ఇవి క్యాన్సర్ మరియు బోలు ఎముకల వ్యాధి వంటి అనేక వ్యాధులతో పోరాడతాయి మరియు మన రక్తంలో సెరోటోనిన్ను పెంచుతాయి.కోడిగుడ్లతో కలిపి వీటిని పొరపాటున కూడా తీసుకోకూడదట... ఎందుకో తెలుసా...కోడిగుడ్లతో కలిపి వీటిని పొరపాటున కూడా తీసుకోకూడదట... ఎందుకో తెలుసా...గ్రీన్ టీ గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి శరీరం నుండి కొవ్వు కణాలను విడుదల చేయడానికి సహాయపడతాయి. ఇది మన కాలేయం కొవ్వును శక్తిగా మార్చడానికి సహాయపడుతుంది, తద్వారా జీవక్రియ పెరుగుతుంది. .గుడ్డు గుడ్డులోని తెల్లసొనలో కేలరీలు తక్కువగా ఉంటాయి, కొవ్వు తక్కువగా ఉంటుంది మరియు ప్రోటీన్ అధికంగా ఉంటుంది, ఇది మన జీవక్రియకు మంచిది. దీని పచ్చసొనలో కొవ్వు కరిగే విటమిన్లు, ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు మరియు కోలిన్ వంటి అనేక జీవక్రియ పోషకాలు ఉన్నాయి, ఇది మీ కాలేయం చుట్టూ కొవ్వు నిల్వ చేయడానికి మా శరీరాన్ని ప్రేరేపించే జన్యు యంత్రాంగాన్ని దాడి చేస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, రోజుకు రెండు గుడ్ల మితమైన వినియోగం మన శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపదు మరియు శరీరం యొక్క లిపిడ్ వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.అయోడిన్ అధికంగా ఉండే ఆహారాలుమీ ఆహారంలో అయోడిన్ జోడించడానికి, మీరు గుడ్లు, పాలకూర, వెల్లుల్లి మరియు నువ్వులతో పాటు సీఫుడ్ మరియు సీఫుడ్ను జోడించవచ్చు.సెలీనియం మరియు జింక్ సంఖ్యను పెంచండి

# 13 ఏళ్ల వయస్సుకే గోల్డ్ మెడల్

## మోమిజీ నిషియా

టోక్యో: టోక్యో ఒలింపిక్స్‌లో జపాన్‌కి చెందిన మోమిజీ నిషియా సంచలనం సృష్టించింది. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రెండో అతి పిన్న వయస్కురాలిగా రికార్డు క్రియేట్ చేసింది. టోక్యో ఒలింపిక్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన స్కేట్‌బోర్డింగ్ లో నిషియా స్వర్ణ పతకం సాధించింది. ట్రిక్స్ సెక్షన్‌లో 15.26 పాయింట్లు సాధించిన నిషియా..పసిడిని కైవసం చేసుకుంది. ఆమె ప్రస్తుత వయస్సు 13 ఏళ్ల 330 రోజులు. దీంతో టోక్యో ఒలింపిక్స్‌లో మొట్టమొదటి వుమెన్స్ స్కేట్‌బోర్డింగ్ ఛాంపియన్ గా నిలిచింది.ఇంతకు ముందు బ్రెజిల్‌కి చెందిన రేసా లీల్ గోల్డ్‌మెడల్ సాధించిన అతి పిన్న వయస్కురాలిగా ఉంది. ఆమె 13 ఏళ్ల 203 వయస్సులో ఈ ఘనత సాధించింది. యూఎస్‌కి చెందిన డైవర్ మర్జోరీ గెస్టింగ్, 1936 బెర్లిన్ గేమ్స్‌లో తన 13 ఏళ్ల 168 రోజుల వయసులో ఒలింపిక్ పతకం సాధించి, ఒలింపిక్ పతకం సాధించిన అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు.


# ఆర్ఆర్ఆర్ లో ప్రభాస్.. అనుష్కలను చూడబోతున్నామా? లేదా?




టాలీవుడ్ జక్కన్న రాజమౌళి ఆర్ ఆర్ ఆర్ సినిమా గురించి వస్తున్న వార్తలు అన్నీ ఇన్నీ కావు. ఇటీవలే విడుదల చేసిన రోర్ ఆఫ్ ఆర్ ఆర్ ఆర్ మేకింగ్ వీడియో సినిమా స్థాయిని అమాంతం పెంచేసింది. ఆర్ ఆర్ ఆర్ సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ లో ప్రమోషనల్ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. ఇటీవల ఈ ప్రమోషన్ సాంగ్ గురించి సోషల్ మీడియాలో అనేక రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆర్ ఆర్ ఆర్ సినిమా ప్రమోషనల్ సాంగ్ ను ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమా ప్రమోషనల్ సాంగ్ లేని విధంగా షూట్ చేస్తున్నారని.. భారీ ఖర్చుతో పాటు అత్యంత ఖరీదైన సెట్టింగ్ లో తెరకెక్కిస్తున్నారు అంటూ చాలా చాలా పుకార్లు షికార్లు చేశాయి.ఇదే సమయంలో ప్రమోషనల్ సాంగ్ లో రాజమౌళి దర్శకత్వం లో నటించిన హీరోలు మరియు హీరోయిన్స్ కనిపించబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. ప్రమోషనల్ సాంగ్ లో కొన్ని సెకన్ల పాటు ప్రభాస్.. అనుష్క.. రానా.. రవితేజ.. నితిన్ ఇంకా కొందరు హీరోలు హీరోయిన్స్ కూడా కనిపించబోతున్నట్లుగా పుకార్లు పుట్టుకు వచ్చాయి. కాని తాజాగా ఆర్ ఆర్ ఆర్ మేకర్స్ నుండి వచ్చిన అధికారిక క్లారిటీ ని అనుసారంగా ఈ సినిమా ప్రమోషనల్ సాంగ్స్ లో వేరే స్టార్స్ ఎవ్వరు కనిపించరు అని.. ఈ సినిమా లో నటించిన వారు పని చేసిన వారు మాత్రమే కనిపిస్తారంటూ క్లారిటీ ఇచ్చారు.మేకింగ్ వీడియో మాదిరిగా కాకుండా ప్రత్యేకంగా పాటను ప్రమోషనల్ సాంగ్ గా తీసుకు వస్తున్నారని.. రామ్ చరణ్ ఎన్టీఆర్ లతో పాటు అందరిని కూడా చూపిస్తారని.. కాని ప్రభాస్.. అనుష్క వంటి ఇతర స్టార్స్ మాత్రం ఇందులో కనిపించరి తేలిపోయింది. అయినా ఇతర స్టార్స్ ను తీసుకు వచ్చి ప్రమోషన్ చేయాల్సిన అవసరం జక్కన్నకు అస్సలు అవసరం లేదు. సినిమా బజ్ పెంచేందుకు క్రేజ్ పెంచేందుకు అలాంటి చిట్కాలను దర్శకులు పాటిస్తారు. కాని రాజమౌళి విషయంలో వాటి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరమే లేదు. జక్కన్న కు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే వారంతా ఉంటారు. అయినా కూడా వారిని ఈ సినిమా కోసం జక్కన్న వినియోగించుకునే అవకాశం లేదు.ఆ అవసరం లేనప్పుడు ఎందుకు వారిని ఇబ్బంది పెట్టడం అనుకుంటాడేమో జక్కన్న. అందుకే ఆర్ ఆర్ ఆర్ సినిమా లో కొత్తగా ఎవరు కనిపించరని తేలిపోయింది. ఆకాశమే హద్దు అన్నట్లుగా అంచనాలు ఉన్న ఈ సినిమా ను అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు సిద్దం చేస్తున్నారు. బాహుబలిని మించిన విజయాన్ని ఈ సినిమా సొంతం చేసుకుంటుందనే నమ్మకంతో యూనిట్ సభ్యులు ఉన్నారు. ప్రముఖ ఓటీటీ శాటిలైట్ సంస్థలు ఈ సినిమా ను ఇప్పటికే భారీ మొత్తానికి కొనుగోలు చేశాయి. ఇండియన్ సినీ ప్రేక్షకులు ఆర్ ఆర్ ఆర్ ను చూసేందుకు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# శంకర్ నుండి మెగా ఫ్యాన్స్ కు డబుల్ ధమాకానా?

సౌత్ లో టాప్ డైరెక్టర్స్ జాబితాలో ముందు ఉండే పేర్లు రాజమౌళి మరియు శంకర్ అనడంలో సందేహం లేదు. వీరితో బాలీవుడ్ స్టార్స్ కూడా వర్క్ చేసేందుకు ఎప్పుడు అంటే అప్పుడు సిద్దంగా ఉంటారు. అలాంటి ఈ ఇద్దరు దర్శకులతో బ్యాక్ టు బ్యాక్ సినిమా చేసే గొప్ప అవకాశం రామ్ చరణ్ కు దక్కింది. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో ఆర్ ఆర్ ఆర్ సినిమా ను చేస్తున్నాడు.ఆ ప్రతిష్టాత్మక సినిమా పూర్తి అవ్వకుండానే చరణ్ తదుపరి సినిమా కన్ఫర్మ్ అయ్యింది. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు బ్యానర్ లో చరణ్ హీరోగా సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చాలా స్పీడ్ గా జరుగుతున్నాయి. ఈ సినిమా పై మెగా ఫ్యాన్స్ తో పాటు తెలుగు ప్రేక్షకులు అంతా కూడా ఆసక్తిగా ఉన్నారు. శంకర్ సినిమా అంటే వందల కోట్ల వసూళ్లు ఖాయం.మెగా అభిమానులకు ఆర్ ఆర్ ఆర్ సినిమా తర్వాత వెంటనే శంకర్ దర్శకత్వంలో సినిమా పండుగను తీసుకు రావడం ఖాయం.



శంకర్ మరియు చరణ్ ల కాంబో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుండి కూడా ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. ఈ సినిమా గురించి వస్తున్న పుకార్లు ప్రతి ఒక్కటి కూడా సినిమాపై అంచనాలను ఆకాశానికి తాకేలా చేస్తున్నాయి. తాజాగా వస్తున్న పుకార్లు మరోసారి సినిమా పై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ సినిమా లో చరణ్ ను దర్శకుడు శంకర్ ద్వి పాత్రాభినయం లో చూపించబోతున్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.చరణ్ ఇప్పటికే ద్వి పాత్రాభినయంలో ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేశాడు. శంకర్ దర్శకత్వంలో మరోసారి డబుల్ రోల్ లో కనిపించేందుకు సిద్దం అవుతున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. దర్శకుడు శంకర్ ఇండియన్ సినిమా లో కమల్ హాసన్ ను ద్విపాత్రాభినయంలో చూపించి సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెల్సిందే. ఇక రోబో సినిమా లో రజినీకాంత్ ను కూడా డబుల్ రోల్ లో చూపించాడు. ఇప్పుడు చరణ్ సినిమా లో కూడా డబుల్ రోల్ ఉంటుందని అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో సినిమా పై పీక్స్ లో అంచనాలు వస్తున్నాయి. ఈ సినిమా ను పాన్ ఇండియా మూవీగా రూపొందిస్తున్నారు.తమిళం మరియు తెలుగు లోనే కాకుండా అన్ని భాషల్లో కూడా ఈ సినిమా భారీగా వసూళ్లు దక్కించుకునేలా దర్శకుడు శంకర్ స్క్రిప్ట్ ఉంది అంటూ ఇండస్ట్రీ వర్గాల టాక్. ఇక ఈ సినిమా కు సాయి మాధవ్ బుర్రా మాటలు అందిస్తుండగా థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. చరణ్ తో జానీ మాస్టర్ స్టెప్పులు వేయించబోతున్నాడు. మరిన్ని విషయాలు అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. శంకర్ సినిమా అంటే ఏళ్లకు ఏళ్ల సమయం పడుతుందని టాక్ ఉంది. కాని తాజాగా రూపొందుతున్న ఈ సినిమాను మాత్రం చాలా తక్కువ సమయంలోనే అంటే వచ్చే ఏడాదికి పూర్తి చేయాలని శంకర్ పట్టుదలతో ఉన్నాడట.దిల్ రాజు తో ఆ విషయమై ఒప్పందం చేసుకున్నాడని సమాచారం అందుతోంది.

# ఓటీటీలో లేడీ సూపర్ స్టార్ లేటెస్ట్ మూవీ..!


కరోనా వైరస్ లాక్ డౌన్ కారణంగా గతేడాది కొన్ని నెలల పాటు థియేటర్లు మూతబడి ఉండటంతో ఫిలిం మేకర్స్ కి ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్స్ ప్రత్యామ్నాయంగా కనిపించాయి. చిన్న హీరోల దగ్గర నుంచి అమితాబ్ బచ్చన్ - సూర్య - నాని వంటి పెద్ద మార్కెట్ హీరోల వరకూ అందరూ ఓటీటీ బాట పట్టారు. ఈ ఏడాది కోవిడ్ సెకండ్ వేవ్ నేపథ్యంలో మళ్ళీ ఓటీటీ రిలీజులు ఊపందుకున్నాయి. మోహన్ లాల్ - విక్టరీ వెంకటేష్ - ఫర్హాన్ అక్తర్ - ఆర్య - అజయ్ దేవగన్ - సిద్దార్థ్ మల్హోత్రా వంటి హీరోలు తమ సినిమాలను డిజిటల్ వేదికల మీద విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన లేటెస్ట్ మూవీ "నేత్రికన్" కూడా ఓటీటీ బాట పట్టింది.తమిళ్ లో స్టార్ హీరోలకు సమానమైన ఇమేజ్ ఉన్న అగ్ర కథానాయిక




నయనతార.. గతేడాది 'అమ్మోరు తల్లి' అనే చిత్రాన్ని హాట్ స్టార్ లో డైరెక్ట్ ఓటీటీ విధానంలో రిలీజ్ చేసింది. ఇప్పుడు ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన క్రైమ్ థ్రిల్లర్ "నేత్రికన్" ను కూడా డిస్నీ + హాట్ స్టార్ ఓటీటీలో విడుదల చేయనున్నారు. ఇన్నాళ్లూ థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ.. మేకర్స్ దీనిపై స్పందించలేదు. అయితే హాట్ స్టార్ గురువారం ఓటీటీ రిలీజ్ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. త్వరలోనే స్ట్రీమింగ్ తేదీని కూడా వెల్లడించే అవకాశం ఉంది.కాగా 'గృహం' చిత్రంతో అందరి ప్రశంసలు అందుకున్న మిలింద్ రౌ "నేత్రికన్" చిత్రానికి దర్శకత్వం వహించారు. రౌడీ పిక్చర్స్ బ్యానర్ పై నయనతార బాయ్ ఫ్రెండ్ విఘ్నేష్ శివన్ ఈ చిత్రాన్ని నిర్మించాడు. ఇందులో అన్ని పాటలను విగ్నేస్ రాయడం విశేషం. కొరియన్ క్రైమ్ థ్రిల్లర్ 'బ్లైండ్' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందనే టాక్ ఉంది. అమ్మాయిలను చంపే ఒక సైకో కిల్లర్ ను వేటాడే అంధురాలి పాత్రలో నయన్ కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ - టీజర్ విశేషంగా ఆకట్టుకున్నాయి.నయనతార కు తెలుగులో ఉన్న మార్కెట్ ను దృష్టిలో పెట్టుకొని 'నేత్రికాన్' చిత్రాన్ని తెలుగులో కూడా పెట్టే అవకాశం ఉంది. ఈ సినిమాకి గిరీష్ గోపాలకృష్ణన్ సంగీతం సమకూర్చగా.. ఆర్.డి. రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందించారు. అజ్మల్ - మణికందన్ - శరణ్ తదితరులు ఈ చిత్రంలో ఇతర ప్రధాన పాత్రలు పోషించారు.

# రాధేశ్యామ్ టాప్ సీక్రెట్ లీక్ అయిందిగా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా.. పూజా హెగ్డే నాయికగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో 'రాధేశ్యామ్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. తెలుగు- హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్ తో యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇదో పీరియాడికల్ ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కుతోంది. అలాగే నాటి కాలమానం ప్రకారం సెట్లలో యాక్షన్ సన్నివేశాలు అంతే ఆసక్తికరంగాను సాగనున్నాయి. అందుకోసం ప్రత్యేకంగా సెట్లు నిర్మించి చిత్రీకరించారు. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్ విజువల్స్ తో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక షూటింగ్ కూడా చాలా వరకూ పూర్తయింది.కరోనా తొలి .. రెండవ వేవ్ సమయంలో సైతం రాధేశ్యామ్ యూనిట్



షూటింగ్ కి పెద్దగా బ్రేక్ వేయలేదు. నిబంధనలు ఉన్నా కరోనా అంతగా అధికంగా లేని దేశంలోకి వెళ్లి మరీ షూటింగ్ చేసారు. సెకెండ్ వేవ్ సమయంలో కొంచెం విశ్రాంతి తీసుకున్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ పనులకు సమయం కేటాయించి వీలైనంత వరకూ ఆ పనులు పూర్తి చేసారు. తాజాగా సినిమాకి సంబంధించిన ఆసక్తికర అప్ డేట్ ని పూజాహెగ్డే అందించింది. షూటింగ్ దాదాపు పూర్తయిందని ఇంకా కేవలం 10 రోజులు షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉందని తెలిపింది. ఇదొక మంచి లవ్ స్టోరీ..ఇలాంటి పాత్రలో నటించి చాలా కాలమైందని...కొత్త ఎక్స్ పీరియన్స్ ఇచ్చిందని పేర్కొంది. అయితే తన పాత్ర రొమాంటిక్ గా ఉంటుందని..ఇతర విషయాలు మాత్రం ఇప్పుడే చెప్పలేనని చెప్పుకొచ్చింది.ఇక పూజాహెగ్డే మిగతా సినిమాల విషయానికి వస్తే మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న 'ఆచార్య'లో నీలాంబరి పాత్రలో నటిస్తోంది. అలాగే బాలీవుడ్ లో 'సర్కస్'.. 'భాయిజాన్' చిత్రాల్లో.. తమిళ్ లో విజయ్ సరసన 'బీస్ట్' అనే చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే పూజా హెగ్డే ఆల్ అబౌట్ లవ్ అనే ఓ స్వచ్ఛంగా సంస్థ ద్వారా సామాజికి సేవ చేస్తోంది.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**